


https://www.sreechakranews.com

# శ్రీచక్ర



సంపుటి 7 | సంచిక 251 | కర్నూలు | శుక్రవారం, 26 జనవరి 2024

SREECHAKRA TELUGU DAILY

పేజీలు 12 | వెల రూ. 5,00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad


# కుటుంబాన్ని చీల్చిందే జగన్ అన్న

అందుకు సాక్ష్యం నేనూ.. అమ్మ విజయలక్ష్మి

వైఎస్ విధానాలకు పాతరేసిన జగన్

నిరుద్యోగులను పట్టించుకోవడం లేదు..ఉద్యోగాల భర్తీ లేదు

పోలవరం కట్టకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు

బీజేపీ గుప్పిట్లో పావుగా మారిన జగన్

కాకినాడలో ఘాటు విమర్శలు చేసిన పీసీసీ చీఫ్ షర్మిల

2



రాష్ట్రాన్ని..తన కుటుంబాన్ని చీల్చింది కాంగ్రెస్ అంటూ... జగన్ అన్న పెద్ద పెద్ద మాటలు మాట్లాడారని చెల్లి షర్మిల ఎద్దేవా చేశారు. వైఎస్ కుటుంబం చీలింది అంటే చేతులారా చేసుకున్నది జగన్ అన్న గారే అంటూ చెప్పకొచ్చారు. దీనికి సాక్ష్యం దేవుడు, దీనికి సాక్ష్యం నా తల్లి వైఎస్సార్ భార్య విజయమ్మ అని వివరించారు. యావత్ కుటుంబం దీనికి సాక్ష్యంగా ఉన్నరని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక వైఎస్ షర్మిల తన మార్క్ చూపిస్తున్నారు. సొంత అన్న అని కూడా చూడకుండా సీఎం జగన్‌ను ఏకిపారేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్, వైసీపీ ప్రభుత్వ పాలనపై పలు విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎం జగన్‌పై ఏపీసీసీ చీఫ్ చేస్తున్న ఆరోపణలు, విమర్శలు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా అన్న జగన్‌రెడ్డిపై షర్మిల రెడ్డి మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. - శ్రీచక్ర, కాకినాడ

# గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ఢిల్లీలో భారీగా భద్రతా ఏర్పాట్లు



**న్యూఢిల్లీ, జనవరి25(శ్రీచక్ర) :**

శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో రిపబ్లిక్ డే పరేడ్ జరగనుంది. పరేడ్ లో సాయుధ బలగాలకు చెందిన 3 శాఖల బృందాలు చేసే కవాతు, ఆయుధాలు, సైనిక పరికరాల ప్రదర్శనలు, మోటార్ సైకిల్ విన్యాసాలు నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు విజయ్ చౌక్ నుంచి కర్తవ్య పథ్ వరకూ పరేడ్ సాగనుంది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ను ఆహ్వానించారు. 72 వేల మంది పరేడ్ తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. 42 వేల సీట్లను సాధారణ పౌరులకు కేటాయించారు. ఈ ఏడాది 'వీక్షిత్ భారత్', 'భారత్ లోక్ తంత్రకి మాతృక' థీమ్ గా ప్రకటించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే దిశగా భారత దేశ పాత్రను నొక్కి చెబుతోంది. మరోవైపు, వేడుకల కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని 11 జోన్లలో 11 మంది డీసీపీలు, 8 వేల మంది పోలీసులు పహారా కాస్తున్నారు. ఏటా గణతంత్ర వేడుకులకు భారీగా భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు కూడళ్లలో తనిఖీలు ముమ్మరం చేశారు.

# భారత్‌తో వైరం మంచిది కాదు

- మాల్దీవుల అధ్యక్షుడికి విపక్షాల హెచ్చరిక

**మాలె, జనవరి25(శ్రీచక్ర) :**

చైనాకు దగ్గరయ్యే క్రమంలో భారత్‌తో కయ్యానికి తెరతీసిన మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు దేశీయంగానూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ వివాదం మాల్దీవుల అభివృద్ధికే చేటు చేస్తుందంటూ అక్కడి ప్రతిపక్షాలు ఆయన్ను హెచ్చరించాయి. చైనాకు చెందిన పరిశోధక నౌకను మాల్దీవుల తీరంలో నిలపడానికి అనుమతించిన తరుణంలో ప్రతిపక్షాల నుంచి హెచ్చరిక రావడం గమనార్హం. మాల్దీవుల అభివృద్ధిలో సుదీర్ఘ భాగస్వామ్యం ఉన్న మిత్రులను దూరం చేసుకోవడం దేశానికే హానికరం అంటూ 'మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఓఆఖ)', ది డెమొక్రాట్స్ అక్కడి ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. భారత్‌ను దీర్ఘకాల మిత్రుడిగా అభివర్ణిస్తూ ఈ వ్యాఖ్యలు చేశాయి. ఎప్పటి నుంచో అనుసరిస్తున్నట్లుగా అన్ని అభివృద్ధి భాగస్వామ్య పక్షాలతో మాల్దీవులు కలిసి పనిచేయాలంటూ మారుతున్న 'విదేశాంగ విధాన వైఖరి'ని ఎత్తిచూపాయి. హిందూ మహా సముద్రంలో శాంతి, సుస్థిరత మాల్దీవుల భద్రతకు చాలా కీలకమని గుర్తుచేశాయి. ఎండీపీ ఛైర్మన్ ఫయాజ్ ఇస్మాయిల్, పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ అహ్మద్ సలీమ్, డెమొక్రాట్స్ అధిపతి హసన్ లతీఫ్, పార్లమెంటరీ గ్రూప్ నేత అలీ అజీమ్ ఇటీవల నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి 15కల్లా తమ భూభాగం నుంచి భారత దళాలు వైదొలగాలని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ఇటీవల తుది గడువు విధించటంతో వివాదం మొదలైంది. భారత సేన వెనక్కి తిరిగి వస్తే.. ఆ స్థానంలో చైనా దళాలు ప్రవేశించే అవకాశం ఉంది. లక్షద్వీప్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై మాల్దీవుల మంత్రులు ముగ్గురు ఇటీవల విమర్శలు చేయడంతో వివాదం ముదిరింది. చైనా పరిశోధక నౌకను మాల్దీవుల తీరంలో నిలపడానికి అనుమతించడంపైనా భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది.



# మాలి బంగారుగనిలో ప్రమాదం

- 70మంది మృత్యువాత పడ్డారని వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి25(శ్రీచక్ర) :**

మాలిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బంగారుగని కూలి 70 మందికి పైగా మరణించారు. గనిలో చిక్కుకున్నవారి కోసం సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఈ మృతుల సంఖ్య మరింత పెరుగనుందని తెలుస్తోంది. మాలిలోని నైరుతి కౌలికోరో ప్రాంతంలోని కంగబా జిల్లాలో గోల్డ్ మైన్ తవ్వుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అక్కడ ప్రభుత్వ జాతీయ జియాలజీ అండ్ మైనింగ్ డైరెక్టరేట్‌లోని సీనియర్ అధికారి కరీమ్ బార్తే తెలిపారు. అంతేకాదు నాలుగు రోజుల క్రితమే ఈ దారుణం జరిగినట్లు ధృవీకరించారు. మీడియా కథనాల ప్రకారంగత శుక్రవారం సంభవించిన ప్రమాదానికి కారణమేమిటో ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. గనుల మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ ఘటనపై ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ దారుణ ప్రమాదంలో మరణించిన వారిలో ఎక్కువగా మైనర్లు ఉన్నట్లు వెల్లడించారు. బంగారు గని కుప్పకూలిన సమయంలో అందులో 150 నుంచి 100 మంది వరకు ఉన్నట్లు.. గనిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు సహాయక చర్యలు వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. ఆఫ్రికాలోని మూడవ అతిపెద్ద బంగారు ఉత్పత్తి దేశమైన మాలిలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణం. దీంతో గోల్డ్ మైన్స్ తవ్వే సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై తరచుగా విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. అధికారులు భద్రతా చర్యలను విస్మరిస్తున్నారని తరచుగా ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే రాష్ట్రం ఈ ఆర్టిసానల్ మైనింగ్ రంగంలో ఆర్డర్ తీసుకురావాలని బార్తే అన్నారు. గనుల మంత్రిత్వ శాఖ స్పందిస్తూ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మైనర్లు, మైనింగ్ సైట్ల సమీపంలో నివసిస్తున్న కమ్యూనిటీలు భద్రతా అవసరాలు పాటించాలని కోరింది.

# పోలీసులకు.. సేవా పతకాలు

- తెలుగు రాష్ట్రాల పోలీసులకు పురస్కారాలు
- దేవేంద్రసింగ్ చౌహాన్, సౌమ్యా మిశ్రాలకు చోటు

2

# మారుమూల గ్రామీణ ప్రాంతాలకు టెలికమ్ సేవలు

ఇక నేరుగా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

గిరిజన ప్రాంతాల్లో 300 సెల్ టవర్లు ఏర్పాటు

వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం జగన్

2




# గణతంత్ర వేడుకల్లో ఏపీ శకటం

- విద్యారంగ అభివృద్ధిని సూచించేలా నమూనా

**విశాఖపట్టణం, జనవరి25(శ్రీచక్ర) :**



దేశ రాజధాని న్యూఢిల్లీలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జరిగే పరేడ్‌లో ఎపి శకటం పాల్గొనబోతోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ దృష్టిని ఆకర్షించడానికి అవకాశాలు ఉన్న అన్నీ అంశాలపై చర్చించింది. చివరకు రాష్ట్రంలో అమలౌతున్న విద్యా సంస్కరణలు, ప్రపంచ స్థాయి పోటీ ను తట్టుకునే విద్యార్థులను తయారు చేసేలా విద్యా సంస్కరణల అమలు నమూనా ప్రదర్శించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖలో తెలిపారు. రాష్ట్రంలో అనేక వర్గాల నిరసనలు, ప్రతికూల పరిస్థితులు మధ్య ఇంగ్లీషు మీడియం విద్య, పాఠశాలలు డిజిటల్ హబ్‌లుగా మారడం ఈ టేబుల్ నమూనాల రూపకల్పనలో ప్రధానాంశంగా మారాయి. టాబ్లో ముందు భాగంలో సాంప్రదాయ గ్రామ తరగతి గదితో ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణల కథనాన్ని టేబుల్‌లో చిత్రించారు. ఈ దృశ్యం వాహనం రెండు వైపులా ఉండే ఆధునిక ప్లే స్కూల్ కాన్సెప్ట్‌గా మారుతుంది. అలా భవిష్యత్తులోకి అడుగు పెడుతూ, పూర్తి సన్నద్ధమైన సైన్స్ ల్యాబ్ టేబుల్‌లో కలిసిపోతుంది. కంప్యూటర్ టాబ్లెట్‌లలో నేర్చుకునే, చురుకుగా పని చేయడంలో నిమగ్నమైన విద్యార్థులను మరోవైపు ప్రదర్శిస్తుంది. చివరగా ఒక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ డిజిటల్ క్లాస్‌రూమ్ వెనుక భాగాన్ని ఆక్రమించింది. ఇంటరాక్టివ్ ప్యానెల్‌లు, స్మార్ట్ టీవీ , ద్విభాషా పాఠ్యపుస్తకాలు, సైన్స్ ఆర్టికల్‌లు, గణిత పరికరాల డిజిటల్ డిస్‌ప్లేలతో టాబ్లో పూర్తి అవుతుంది. పర్యవేక్షక నోడల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ పోతుల మాట్లాడుతూ 55 సెకనుల థీమ్ సాంగ్ పరేడ్‌లో ఉంటుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇటీవల అడాప్ట్ చేసుకున్న వినూత్న విద్యా విధానం, డిజిటల్ టెక్నాలజీ, 21వ శతాబ్ద పౌరులను ఎలా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ఈ పాట వివరిస్తుందన్నారు. ఆంధప్రదేశ్‌కు చెందిన 18 మంది స్థానిక వ్యక్తుల బృంద కవాతు ఈ పాటకు ప్రాణం పోస్తుందన్నారు. సాంకేతిక నిపుణులు, వర్కర్ల బృందం టాబ్లో ను సూక్ష్మంగా రూపొందించారనీ, బొమ్మలకు జీవం పోసిన రూపాన్ని అందించారు అని చెప్పారు.

# భీమిలి నుంచి వైసీపీ ఎన్నికల ప్రచారం

- 27న ప్రచార సభకు భారీగా ఏర్పాట్లు
- ఎన్నికల ప్రచార శంఖం పూరించనున్న జగన్




2

# పోలీసులకు.. సేవా పతకాలు

- తెలుగు రాష్ట్రాల పోలీసులకు పురస్కారాలు
- దేవేంద్రసింగ్ చౌహాన్, సౌమ్యా మిశ్రాలకు చోటు

**న్యూఢిల్లీ, జనవరి25(శ్రీచక్ర) :**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు కేంద్ర హోం శాఖ వివిధ పోలీసులు పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1132 మందికి గ్యాలంట్రీ పతకాలు అందజేయనుంది. ఈ మేరకు అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 275 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 753 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలను ప్రకటించింది. వీరిలో తెలంగాణ నుంచి 20 మందికి పతకాలు దక్కాయి. అందులో రాష్ట్రానికి 6 గ్యాలెంటరీ, 12 ఉత్తమ ప్రతిభ, 2 రాష్ట్రపతి అవార్డులు ఉన్నాయి. సీనియర్ పోలీసు అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్, అదనపు డీజీ సౌమ్య మిశ్రాకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. అదేవిధంగా రాష్ట్రానికి చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక ఏఆర్ ఎస్సై, 12 మంది అధికారులు విశిష్ట సేవ పతకాలు లభించాయి. వీరితోపాటు ఇద్దరు జైళ్ల శాఖ అధికారులు ప్రెసిడెంట్ మెడల్స్ అందుకోనున్నారు. ఇక ఉత్తమ ప్రతిభ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 9 అవార్డులు దక్కాయి.ఈ పురస్కారాల్లో తెలుగు రాష్ట్రాల్లో 29 మందికి పతకాలు దక్కాయి. తెలంగాణ నుంచి 20 మంది.. ఏపీ నుంచి 9 మందికి పతకాలు ప్రకటించారు. ఏపీలో 9 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 12 మంది పోలీస్ విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. తెలంగాణ అదనపు డీజీలు సౌమ్యా మిశ్రా, దేవేంద్ర సింగ్ చౌహాన్ లకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు వరించాయి. గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 277 మందిలో అత్యధికంగా జమ్మూ కశ్మీర్ నుంచి 72 మంది పోలీసులు, ఛత్తీస్ గఢ్ నుంచి 26 మంది, ఝార్ఖండ్ నుంచి 26, మహారాష్ట్ర నుంచి 18 మంది ఉన్నారు. సీఆర్పీఎఫ్ (అఖీఖఈ) నుంచి 65 మంది, సశస్త్ర సీమాబల్ నుంచి 21 మందికి ఈ పురస్కారాలు వరించాయి. అలాగే, లెఫ్ట్ వింగ్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వరిస్తోన్న 119 మంది, జమ్మూ కశ్మీర్ లో పని చేస్తోన్న 133 మంది మెడల్స్ దక్కాయి.

# తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేత



- మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు

**ఉదయగిరి/వరికుంటపాడు, జనవరి 25 (శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు నూతన ఇంచార్జి తాసిల్దార్ శ్రీనివాసులు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ మండలంలో వైసీపీ నాయకులు గ్రామాల్లో భూ దందాలకు పాల్పడుతున్నారని అంతేకాకుండా గ్రామాల్లో భూ పంపిణీ పేరుతో రైతుల దగ్గర నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని , గ్రామాల్లోని అర్హత కలిగిన రైతులకే పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల వైసీపీ నాయకులు అధికార అండదండలతో అనర్హులకు కూడా జాబితాలో ప్రతిపాదనలు సిద్ధం చేశారని అందువలన అసైన్మెంట్ కమిటీ జాబితా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన నిరుపేద రైతులకు భూ పంపిణీ చేయాలని కోరారు. మండలంలో రైతులు పట్టాలు పొంది ఆన్లైన్ నమోదు కాక అనేక మంది రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని కొంతమంది వైసీపీ నాయకులు పట్టాలు పొందిన రైతుల సర్వే నెంబర్లను జాబితాలో ప్రతిపాదిస్తున్నారని అందువలన భవిష్యత్తులో గ్రామాల్లో భూ తగాదాలు జరగకుండా అర్హులైన న్యాయమైన రైతులకు సాగులో లేని సర్వే నెంబర్లు భూ పంపిణీ చేసి న్యాయం చేయాలని తెలిపారు. పలు గ్రామాల్లో మండలంలోని కీలక వైసిపి నాయకులు బినామీ పట్టాలు పెట్టుకొనుటకు ప్రయత్నాలు చేస్తున్నారని అందువలన ప్రతి గ్రామంలోని అసైన్మెంట్ కమిటీ జాబితా క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హత కలిగిన న్యాయమైన రైతులకు పట్టాలు మంజూరయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కన్వీనర్ మధుసూదన్ రావు, మాజీ మండల కన్వీనర్ వెంకయ్య నాయుడు, గుర్రం గోపి, పాలకొల్లు భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు లాబాన్ తదితర మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబాన్ని చీల్చిందే జగన్ అన్న

- అందుకు సాక్ష్యం నేనూ.. అమ్మ విజయలక్ష్మి
- వైఎస్ విధానాలకు పాతరేసిన జగన్
- నిరుద్యోగులను పట్టించుకోవడం లేదు..ఉద్యోగాల భర్తీ లేదు
- పోలవరం కట్టకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు
- బీజేపీ గుప్పిట్లో పావుగా మారిన జగన్
- కాకినాడలో ఘాటు విమర్శలు చేసిన పీసీసీ చీఫ్ షర్మిల

**కాకినాడ, జనవరి25(శ్రీచక్ర) :**

రాష్ట్రాన్ని,తన కుటుంబాన్ని చీల్చింది కాంగ్రెస్ అంటూ... జగన్ అన్న పెద్ద పెద్ద మాటలు మాట్లాడారని చెల్లి షర్మిల ఎద్దేవా చేశారు. వైఎస్ కుటుంబం చీలింది అంటే చేతులారా చేసుకున్నది జగన్ అన్న గారే అంటూ చెప్పుకొచ్చారు. దీనికి సాక్ష్యం దేవుడు, దీనికి సాక్ష్యం నా తల్లి వైఎస్సార్ భార్య విజయమ్మ అని వివరించారు. యావత్ కుటుంబం దీనికి సాక్ష్యంగా ఉన్నరని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక వైఎస్ షర్మిల తన మార్క్ చూపిస్తున్నారు. సొంత అన్న అని కూడా చూడకుండా సీఎం జగన్‌ను ఏకిపారేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్, వైసీపీ ప్రభుత్వ పాలనపై పలు విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎం జగన్‌పై ఏపీసీసీ చీఫ్ చేస్తున్న ఆరోపణలు, విమర్శలు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా అన్న జగన్‌రెడ్డిపై షర్మిల రెడ్డి మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రాన్ని, తన కుటుంబాన్ని చీల్చిందని పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు జగన్ అన్న. దేవుడే గుణపాఠం చెప్తారట. నిజానికి ఆంధ్ర రాష్ట్రం ఇలా అభివృద్ధి లేకుండా దయనీయ స్థితిలో ఉంది అంటే కారణం జగన్ అన్నే. ఇవాళ వైఎస్సార్ కుటుంబం చీలింది అంటే అది చేతులారా చేసుకున్నది జగన్ అన్నే. దీనికి సాక్ష్యం దేవుడు... దీనికి సాక్ష్యం నా తల్లి, వైఎస్సార్ భార్య విజయమ్మ. దీనికి సాక్ష్యం నా యావత్ కుటుంబం. జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఇబ్బందిలో ఉంటే.. 18 మంది రాజీనామాలు చేసి జగన్ అన్న వైపు నిలబడితే.... అధికారంలో వచ్చాకా మంత్రులను చేస్తా అన్నారు. ఇవాళ వాళ్ళలో ఎంత మంది మంత్రులుగా ఉన్నారు? వాళ్ళు రాజీనామాలు చేస్తే అమ్మ, నేను వాళ్ళ కోసం తిరిగాం. వాళ్ళ గెలుపు కోసం పాటు పడ్డాం. వాళ్ళను గెలిపించాం. వైసీపీ కష్టాల్లో ఉందని నన్ను పాదయాత్ర చేయమన్నారు. నా ఇంటిని, పిల్లలకు పక్కన పెట్టి... ఎండనక, వాననక రోడ్ల మీదనే ఉన్న. ఆ తర్వాత సమైక్య యాత్ర కోసం అడిగితే ప్రజల బాగు కోసమే కాదా అని ఆ యాత్ర కూడా చేశా. తెలంగాణలో కూడా ఓదార్పు యాత్ర చేశా. ఎప్పుడు అడిగితే అప్పుడు మాట కూడా మాట్లాడకుండా అండగా నిలబడ్డా. ఎందుకు అని అడగకుండా, స్వలాభం చూడకుండా, నిస్వార్థంగా ఏది అడిగితే అది చేశా. గత ఎన్నికల్లో బై బై బాబు అంటూ ఊరూరా తిరిగా. దేశంలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ క్యాంపెయిన్ చేశా. మిమ్మల్ని గెలిపించా. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జగన్ మోహన్ రెడ్డి వేరే మనిషిగా మారిపోయాడు. నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా కూడా పర్వాలేదు అనుకున్నాను. మంచి ముఖ్యమంత్రి అయితే చాలు.. వైఎస్సార్ పేరు, ఆశయాలను నిలబెడితే చాలు అనుకున్న. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రితో సహా అందరూ బీజేపీకి బానిసలుగా మారారు. బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే లేడు, ఎంపీ లేడు. అయినా ఏపీలో బీజేపీ రాజ్యం ఏలుతుంది. జగన్ ఆయన పార్టీని, రాష్ట్రాన్ని బీజేపీ దగ్గర తాకట్టు పెట్టాడు. ప్రత్యేక హోదా అడగకుండా బానిస అయ్యారు. 5 ఏళ్లలో ఒక్కరోజు కూడా హోదా అడగలేదు. రాష్ట్రంలో ఇప్పుడు హోదా అన్న అంశమే లేదని అంటూ తనదైన శైలిలో జగన్‌పై షర్మిల విరుచుకుపడ్డారు. పోలవరం ప్రాజెక్ట్ వైఎస్సార్ డ్రీమ్ ప్రాజెక్ట్. అంతకు ముందు ఏ ప్రభుత్వాలు చేయని సాహసం వైఎస్సార్ చేశారు. వైఎస్సార్ 2004 లో ముఖ్యమంత్రిగా అయిన 6 నెలల్లో ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టారు. వైఎస్సార్ హయాంలో రూ.4500 కోట్లు ఖర్చు పెట్టి కాలువలు తవ్వించారు. 8 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 12 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం. వైఎస్సార్ మరణించిన తర్వాత...టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేశాయి. కాంగ్రెస్ పార్టీ పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చింది. బాబు అధికారంలో వచ్చాక అంచనా వ్యయం రూ.30 వేల కోట్లకు పెంచాడే తప్ప ఉపయోగం లేకుండా పోయిందని అన్నారు. వైఎస్సార్ పనితీరు మీలో కన్పిస్తే మీరు వైఎస్సార్ వారసులు అవుతారు. జగన్ ప్రభుత్వంలో వ్యవసాయం దండుగ. వైఎస్సార్ హయాంలో వ్యవసాయం ఒక పండుగ. వైఎస్సార్ పథకాలు ఒక్కటి కూడా అమలు కావడం లేదు. ఇది రైతు రాజ్యం కాదు.. వైఎస్సార్ సుపరిపాలన అంతకన్నా కాదు. ఉద్యోగాలు లేవు.. నోటిఫికేషన్‌లు ఇవ్వరు. 30 వేల టీచర్ ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా నోటిఫికేషన్ లేదు. వైఎస్సార్ ప్రజల మనిషి. ప్రజల మధ్యే బ్రతికాడు. ఇప్పుడు జగన్ ఒక నియంత. పెద్ద పెద్ద కోటలు కట్టుకున్నాడు. ప్రజలకు కనపడరు.. ఎమ్మెల్యేలను కలవరు. మీరా రాజశేఖర్ రెడ్డి వారసులు . వైఎస్సార్ నష్టపోతున్న కంపెనీలను ప్రభుత్వ పరం చేయించారు. మీరు ఉన్న ఆస్తులను అమ్ముతున్నారు. వైఎస్సార్ పేరును చెడగొట్టింది మీరు.. ఎంతో మంది త్యాగాలు చేస్తే మీరు ముఖ్యమంత్రి అయ్యారు. నా అనుకున్న వాళ్ళను అందరినీ దూరం చేశారు. వైఎస్సార్ పాలనకు జగన్ అన్న పాలనకు నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యలు చేశారు. నేను కాంగ్రెస్ పార్టీలో చేరే ముందు సోనియా గాంధీని కలిశా. వాళ్ళు వైఎస్సార్‌పై పెట్టుకున్న ప్రేమ అభిమానాన్ని చూశా. వైఎస్సార్ ఉంటే కాంగ్రెస్‌కు ఈ పరిస్థితి వచ్చేది కాదు అన్నారు. వైఎస్సార్ కుటుంబంలో జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు. ఇవన్నీ అర్థం చేసుకున్న తర్వాత నేను కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు ఒప్పుకున్న. నాన్న నాకు నేర్పించింది ప్రజల మధ్య ఉండాలని.. నన్ను కాంగ్రెస్ ఏపీకి వెళ్ళమంటే పని చేయాలని నిర్ణయించు కున్నా. ఇక్కడ బీజేపీ చేస్తున్న తెర వెనుక రాజకీయాలను తెలుసుకున్న. ప్రజలకు జరుగుతుంది అన్యాయం కాబట్టి... నేను ఇక్కడ పని చేయాలని అనుకున్న. ఇది వ్యక్తిగత నిర్ణయం కానే కాదు. నా వ్యక్తిగత నిర్ణయం అయితే... 2019 లోనే నిర్ణయం తీసుకున్న. ఈ నిర్ణయంతో నేను టా÷-గ్గ÷ట్ అవుతా అని తెలుసు. నన్ను ఎటాక్ చేస్తారని తెలుసు. నా కుటుంబం నిట్ట నిలువునా చీలుతుంది అని తెలుసు. అయినా నేను తీసుకున్న నిర్ణయం ప్రజల కోసమే' అంటూ షర్మిల పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల (జా ÷ూరజీసపత్గి÷జీ) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారతీయ జనతా పార్టీలో జగన్ కీలుబొమ్మగా మారారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే లేరు, ఎంపీ లేరు కానీ ఇక్కడ బీజేపీ రాజ్యం ఏలుతోందని వైఎస్ షర్మిల ఆరోపించారు. తన స్వార్థం కోసం రాష్ట్రాన్ని పార్టీని బీజేపీ వద్ద జగన్ తాకట్టు పెట్టాడని విరుచుకుపడ్డారు.

# మారుమూల గ్రామీణ ప్రాంతాలకు టెలికమ్ సేవలు

**అమరావతి,జనవరి25(శ్రీచక్ర) :**

మారుమూల గ్రామీణ ప్రాంతాలకు టెలికమ్ సేవలు అందుబాటులోకి రావడంతో అక్కడ ప్రజలకు పథకాలు వేగంగా అందుతాయని, అభివృద్ధిలో వేగం పెరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో 300 సెల్‌టవర్లను క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు సమర్ధవంతమైన టెలికాం సేవలు అందించేందుకు ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో 136 , జియో ఆధ్వర్యంలో 164 టవర్లు ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 246, పార్వతీపురం మన్యం జిల్లాలో 44, ప్రకాశంలో 4, ఏలూరులో 3, శ్రీకాకుళంలో 2, కాకినాడలో 1 టవర్ ఏర్పాటయ్యాయి.ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ఇవాళ 300 టవర్లు, జూన్‌లో 100 టవర్లు ఏర్పాటు చేశారు. దాదాపు 400 కోట్లు ఖర్చు చేశారు. 400 టవర్ల ఏర్పాటు ద్వారా 2.42 లక్షల మందికి ఉపయోగకరం. ఇవాళ ఏర్పాటు చేసిన టవర్ల ద్వారా 2 లక్షల మందికి ఉపయోగం. మొత్తంగా కలిపి 2887 టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా 3,119 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని సీఎం పేర్కొన్నారు. టవర్లకు అవసరమైన భూములను వెంటనే అప్పగించడం జరిగింది. 5,549 గ్రామాలకు పూర్తి మొబైల్ టెలికాం సేవలు అందుతాయి. అత్యంత మారుమూల ప్రాంతాలు నెట్‌వర్క్ పరిధిలోకి వస్తాయి. సమాచార సంబంధాలు బాగా మెరుగుపడతాయి. ఈ ప్రాంతాలకు పథకాల అమలు మరింత సులభతరం అవుతుంది. వేగంగా, పారదర్శకంగా పనులు ముందుకు సాగుతాయి. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, ఇంగ్లిషు మీడియం స్కూల్స్ ఇవన్నీకూడా గ్రామ రూపురేఖలను మారుస్తాయి. ఈ ప్రాంతాల్లో టెలికాం సేవలు కారణంగా ఇవి మరింత బలోపేతంగా నడుస్తాయని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, ఐటీశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమ్యూనికేషన్స్ (ఐటీశాఖ) డైరెక్టర్ సి చంద్రశేఖర్ రెడ్డి, భారతీ ఎయిర్‌టెల్, రిలయెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాగుతూ..సార్.. మేం గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. మాకు పాడేరు హెడ్ క్వార్టర్‌కు వెళ్ళాల్సి వచ్చేది ప్రతి విషయానికి గతంలో ఫోన్ చేయాలంటే కొండల పైకి ఎక్కాల్సి వచ్చేది. ఇప్పుడు నేరుగా మా గ్రామానికే సెల్‌టవర్స్ వేశారు. మాకు సిగ్నల్ కూడా వచ్చింది. మా గ్రామస్తులు అంతా సంతోషంగా ఉన్నారు, మాకు గతంలో సచివాలయం అంటే, కలెక్టర్ అంటే, వలంటీర్ అంటే ఏం తెలీదు, కానీ ఇప్పుడు అందరి గురించి తెలిసింది. జగనన్న మీరు మా బాధలు గమనించి మాకు సాయం చేస్తున్నారు. గతంలో రోడ్లు లేవు, కానీ ఇప్పుడు చక్కటి రోడ్లు వేశారు, మీరు ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు మాకు అందుతున్నాయి, మీరు మా వెంట ఉన్నామన్న భరోసా ఇచ్చి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారు, జగనన్నా మీరు మాకు అన్నీ ఇస్తున్నారు, మేం మీ పథకాల ద్వారా లబ్ధిపొంది మా కాళ్ళపై మేం నిలబడ్డాం, మేమంతా కూడా మళ్ళీ మీరే రావాలని కోరుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. థ్యాంక్యూ అన్నా అని అన్నారు. అన్నా, మా గిరిజన గ్రామాలకు ఫోన్ సిగ్నల్ లేదు. 5 కిలోమీటర్లు వెళ్లి ఫోన్ చేయాల్సి వచ్చేది. ఏదైనా ప్రమాదం జరిగినా అంబులెన్స్‌కి చెప్పడానికి కూడా ఫోన్ సిగ్నల్ ఉండేది కాదు, మా బంధువుల కష్టసుఖాలు తెలిసేవి కాదు. కానీ ఇప్పుడు నేరుగా వారితో మాట్లాడుతున్నాం. మా పిల్లలు కూడా బాగా చదువుకుంటున్నారు. నేరుగా టీచర్స్‌తో మాట్లాడుతున్నాం. గవర్నమెంట్ స్కీమ్స్ గురించి తెలిసేది కాదు. కానీ ఇప్పుడు నేరుగా జగనన్నకు చెబుదాం నెంబర్ 1902 కి కాల్ చేసి మాట్లాడగానే మా సమస్య పరిష్కారం అయింది. మా సచివాలయంలో సిగ్నల్ లేక ఇబ్బందులు పడేవారు, ఇప్పుడు మీ చొరవ వల్ల ఇంటి నుంచే అన్నీ తెలుసుకుంటున్నాం, ఏదైనా మా సచివాలయంలో ఇస్తున్నారు. బ్యాంకులకు కూడా వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే డబ్బు కూడా తీసుకుంటున్నాం, మాకు సెల్ టవర్ వచ్చిన తర్వాతే నిజంగా సంతోషంగా ఉంది. నిన్నటి కన్నా నేడు, నేటి కన్నా రేపు బావుండాలి, మీరు మళ్లీ వస్తేనే మాకు చాలా బావుంటుంది. మళ్లీ మీరే రావాలని కోరుకుంటున్నాం అని అన్నారు.

# వైసీపీలోని మరో వర్గం నూతన తాసిల్దార్ కు వినతి పత్రం

- వైసిపి మాజీ మండల కన్వీనర్ బాల గురువారెడ్డి, విరువూరు సర్పంచ్ భాస్కర్ రెడ్డి తదితరులు

**ఉదయగిరి/వరికుంటపాడు, జనవరి 25 (శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో నూతన ఇన్చార్జి తాసిల్దార్ శ్రీనివాసులు ను స్థానిక మండలంలోని మాజీ మండల కన్వీనర్ బాల గురువారెడ్డి వర్గం కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం తాసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మండల కన్వీనర్ బాల్ గురవారెడ్డి వర్గం పలు విషయాలు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలీ అహ్మద్ వర్గం గ్రామాలలో భూదందాలకు పాల్పడుతూ సమస్యలు సృష్టిస్తున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం నూతన భూ పంపిణీ జాబితా లిస్టు అవుకతోకలు తో రూపొందించారని వాటిని సమగ్రంగా విచారించి అర్హులైన న్యాయమైన రైతులకు మాత్రమే భూ పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా గ్రామాల్లో పేద బడుగు బలహీన వర్గాల నుంచి భూ పంపిణీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జేబులో నింపుకుంటున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా మండలంలో పలువురు క్షేత్రస్థాయి అధికారులు వారికి వంతు పాడుతు అవినీతికి పాల్పడుతూ గ్రామాలలో నూతన సమస్యలకు తెర లేపుతున్నారని అందువలన ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో గ్రామసభలో నిర్వహించి అర్హత కలిగిన నిరుపేద రైతులకు మంజూరు చేయాలని కోరారు.



# గణతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను, పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలన





- గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

**కర్నూలు, జనవరి 26(శ్రీచక్ర) :**

జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరడ్ మైదానంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్ పోలీసులు గురువారం నిర్వహించారు. ఈ సంధర్భంగా పరేడ్ రిహార్సల్స్ కు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ హాజరై, గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ, పరేడ్ రిహార్సల్స్ , అతిధుల గ్యాలరీలు, స్టాల్స్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, ఎఆర్ డిఎస్పీ ఇలియాజ్ భాషా, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సివిల్, ఎఆర్, ట్రాఫిక్ పోలీసులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రయోజనం



- టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి

**పెద్దకడబూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు టీడీపీ ద్వారానే రాజకీయ ప్రయోజనం చేకూరిందని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి అన్నారు. గురువారం పెద్దకడబూరులోని టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్వగృహం నందు జయహో బీసీ కార్యక్రమం మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అణగారిన వర్గాల అభ్యున్నతికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. బీసీల ద్రోహి ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కార్పొరేషన్ రద్దు చేసి వేల కోట్ల రూపాయలు దండు కున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టిడిపి ద్వారానే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. అలాగే ఈ నెల 28న పత్తికొండలో జరిగే రా కదలిరా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో వివిధ గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కోడిగుడ్ల ఏసేపు, బీసీ సాధకార సమితి సభ్యులు మల్లికార్జున, ఆర్ టిఎస్ తాలూకా అధ్యక్షులు దశరథరాముడు, నాయకులు మధుసూదన్ రెడ్డి, మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, నరసన్న, వీరేష్ గౌడ్, దాసప్పరెడ్డి, శివ, బాష, సత్యన్న గౌడ్, బజారి, ఆదాము, ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, నాగప్ప అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ సోషల్ మీడియాలో యాక్టివ్ సభ్యులకు టీడీపీ జెండాలు బహుకరణ



**పెద్దకడబూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో టీడీపీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంలో యాక్టివ్ గా పని చేసిన నలుగురు టీడీపీ గ్రామ నాయకులను మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి అభినందించారు. గురువారం పెద్దకడబూరులో జరిగిన టీడీపీ జయహో బీసీ కార్యక్రమంలో తిక్కారెడ్డి పెద్దకడబూరుకు శివ, మేకడోనకు చెందిన కాలువ ఉసేని, తారాపురంకు చెందిన చంద్ర, చిన్నకడబూరుకు చెందిన నరసన్నలకు టీడీపీ జెండాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన




**కర్నూలు, జనవరి 25 (శ్రీచక్ర):**

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్న యువతకు సూచించారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుండి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి యువత ఓటు హక్కు గురించి చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యవంతులను చేయాలన్నారు.. అలాగే ప్రతి ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే మన భవిష్యత్తుకు మంచి మార్గం వేసుకున్న వారం అవుతామన్నారు. ఓటు హక్కు కలిగిన విద్యార్థులు ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో పోలింగ్ శాతం చాలా తక్కువగా అవుతుందని, అలా కాకుండా పోలింగ్ శాతం పెరిగేలా యువత ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ శాతం పెరిగేలా చూడాలని యువతకు సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వరం అని, కావున ఓటు హక్కును వినియోగించుకోవడం ఓటరు యొక్క బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు, నోడల్ ఆఫీసర్ (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) శ్రీనివాస్ కుమార్, సెట్కూర్ సీఈఓ రమణ, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, ఎన్నికల విభాగపు సూపరింటెంట్ మురళి, వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కల్లూరు, జనవరి 25(శ్రీచక్ర):**

పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలం చిన్న టేకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన డా.వైఎస్సార్. రైతు భరోసా కేంద్రం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనం గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాల ప్రారంభోత్సవానికి పాణ్యం ఎమ్మెల్యే మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమాల ద్వారా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పలువురు గ్రామంలోని మరియు మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతరం బస్తిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన డా.వైఎస్సార్. రైతు భరోసా కేంద్రం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనం, డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పాణ్యం ఎమ్మెల్యే మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమాల ద్వారా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పలువురు అర్హులైన వారికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ ఎమ్మెల్యే చేశారు. ఈకార్యక్రమంలో కల్లూరు తహశీల్దార్, పలువురు గ్రామంలోని మరియు మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కర్నాటక మద్యం స్వాధీనం - ఇద్దరు అరెస్టు



**పెద్దకడబూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ సిబ్బంది ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన గుడిదల రామాంజి, తాయన్న అను ఇద్దరు వ్యక్తుల నుంచి 5 బాక్సుల 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్స్ కర్ణాటక మద్యం లభించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో పోలీసులు పాల్గొన్నారు.



# కోసిగి మండలంలోని అర్లబండ జాతరకు హాజరైన మంత్రాలయం తెదేపా నాయకులు

- ఎన్.రాఘవేంద్రరెడ్డి, చుడి ఉలిగయ్య



**కౌతాళం,జనవరి 25(శ్రీచక్ర):**

అర్లబండ గ్రామ నాయకుల పిలుపు మేరకు జాతరకు హాజరైన ఎన్.రాఘవేంద్ర రెడ్డి చుడి ఉలిగయ్య పల్లెపాడు రామిరెడ్డి ముత్తరెడ్డి...ఊరిలోని కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పూల మాలలు వేసి సత్కరించారు. అనంతరం మాధవరం రాఘవేంద్ర రెడ్డి అర్లబండ దుర్గాదేవి చూపులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ్యులు అర్లబండ మఠ్రిస్వామి తాత మరియు వారి తనయులు కృష్ణవధూత ఆశీర్వాధాలు తీస్కొని రైతులు, ప్రజలు, కార్యకర్తలు ఆరోగ్యఐశ్వర్యాలతో ఉండాలని ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పల్లెపాడు బుజ్జి,అర్లబండ సర్పంచ్ మల్లికార్జున, వీరయ్య, అయ్యప్ప, హనుమేష్, రామన్న, మఠ్రిస్వామి, లక్కే గోవిందు, బీమారెడ్డి,పోతుల వీరారెడ్డి,ముకన్నా,బాపురం ఉసెని,భీమారెడ్డి, రాగప్ప కేశయ్య మరియు తదితరులు పాల్గోన్నారు.

## శారదా కాలేజ్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఈఓ చర్యలు తీసుకోవాలి



**ప్రొద్దుటూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

కళాశాల విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించడం సరికాదంటూ గీతాశ్రమం ఈఓ కార్యాలయం వద్ద గురువారం శారదా కాలేజీ విద్యార్థుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శారదా జూనియర్ కాలేజి కరస్పాండెంట్ సురేష్ బాబు రెడ్డి మాట్లాడుతూ తాను శారదా జూనియర్ కాలేజిని స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమం ఆవరణంలో నడుపుతున్నామని తెలిపారు. కళాశాల వెనుక వైపు గ్రౌండ్ వుందని, అది ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థులకు సంబంధించిన గ్రౌండ్ అని, తమ కళాశాలకు ఆ గ్రౌండ్ కు సంబంధం లేదని ఈఓ తెలపడంతో తమ విద్యార్థులు ఆ గ్రౌండ్ లోకి వెళ్లడం లేదని వివరించారు.కానీ అందులో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్. సి. సి విద్యార్థులు మార్చ్ పాస్ట్ చేస్తూ సౌండ్ పొల్యూషన్ చేస్తున్నారని, సాధారణంగా సాయంత్రం 4 తర్వాత చేసే వారని, గత 2 రోజుల నుండి ఉదయమే చేస్తున్నారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందిగా వుందన్నారు. ఈ పరిస్థితి గురించి ఈఓ శంకరబాలాజీ కి తెలిపితే చర్యలు తీసుకుంటామని చెబుతారే కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో పోలీసులను ఆశ్రయిస్తే కొద్ది రోజుల పాటు ఆపారని, మళ్లీ షరా మామూలే అన్నారు. తాను లాభాపేక్ష లేకుండా పేద విద్యార్థుల కోసం కళాశాల నడుపుతున్నానని, ఇకనైనా ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్ జన్మదిన వేడుకలు

- పెద్ద ఎత్తున రక్తదానం చేసిన నాయకులు

**ప్రొద్దుటూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**



ప్రొద్దుటూరు తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఆయన నివాసం వద్ద ఉదయం నుండే పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్య కర్తలు, జనసేన పార్టీ నాయకులు, సైని కులు, నందమూరి అభిమానులు, కు టుంబ సభ్యుల నడుమ సంబరాలు నిర్వ హించారు. పార్టీ నాయకులు, కార్య కర్తలు ఆయనను గజమాలతో సత్కరించడంతో పాటూ పలువురు కేక్ తీసికొని వచ్చి కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు భోజన వసతి కల్పించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన టిడిపి నాయకులు, కార్య కర్తలు, జనసేన పార్టీ నాయకులు, సైనికులు, నందమూరి అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ జన్మదినం తనకు తన గత జన్మదినాలతో పోలిస్తే ప్రత్యేకమని, పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం సంతోషకపమని వివరించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్నది తెలుగుదేశం పార్టీ జనసేన ప్రభుత్వ మేనని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



**కడప సిటీ, జనవరి 25 (శ్రీచక్ర) :**

చింతకొమ్మదిన్నె మండలం కడప-రాయచోటి మెయిన్ రోడ్‌లోని ఎన్‌టిపిసిపోలీస్ చెక్ పోస్ట్ వద్ద గురువారం చింతకొమ్మ దిన్నె పోలీస్ స్టేషన్ ఈ ఎస్ఐ బి. శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయాచోటి వైపు నుండి ఒక వ్యక్తి అక్రమంగా మద్యం తీసుకొని పోతుండగా అతన్ని పట్టు కున్నారు. అతని వద్ద నుండి మద్యం స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

# ప్రవీణ్ అబద్దాలను ప్రజలు గుర్తించాలి

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**



ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి కేవలం అబద్దాలనే నమ్ముకున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్ లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్ కేవలం అబద్దాలనే నమ్ముకున్నారని, ఆ అబద్దాన్ని కూడా నిజమని నమ్మేలా మసిపూసి మారేడు కాయ చేయడం అతని నైజమని విమర్శించారు. గతంలో వున్న మాజీ ఎమ్మెల్యే లు ఎంవి రమణారెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డి, తదితర నాయకులు ఎవరూ అబద్ధమనే ఆయుధంతో రాలేదని, అది కేవలం ప్రవీణ్ కుమార్ రెడ్డి ఒకనికే చెల్లిందన్నారు. ప్రొద్దుటూరు లో ఏ చిన్న సంఘటన జరిగినా తనకే ఆపాదించడం, తాను చేయని అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్లు చెప్పడమే అతని పని అని వివరించారు. వ్యాపారుల పై ఇన్ కం ట్యాక్స్ దాడులు జరిగి తన నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడితే తనకు లాభమా అని ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక మునుపే ఎన్నికల కమిషన్ దాడులు చేయించి సామాన్యులు, వ్యాపారులను ఇబ్బంది పెడితే తాను ప్రశ్నించి, వారికి అండగా నిలిచానని, దానిని కూడా తానే చేయించానని, తిరిగి తానే సానుభూతి కోసం వారికి మద్దతిచ్చానని మాట్లాడటం సమంజసం కాదన్నారు. రాజకీయ నాయకుడిగా పదవి నిలుపుకునేందుకు కావాల్సింది సామర్థ్యమే కానీ సానుభూతి ఎంతమాత్రం కాదన్నారు. ఎగ్జిబిషన్ లో ఫ్రీ ఎంట్రీ పెడితే లోపల అధిక ధరలకు విక్రయించారని, దానికి తానే కారణమనడం అవివేకమన్నారు. కరోనా వచ్చిన సమయంలో తాను, తమ వైసీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులే ప్రజలకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. ప్రవీణ్ తనపై చేసే వన్ని నిరాధార ఆరోపణలే అని, వాటిని అతనే నిరూపించలేడన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో తన ప్రమేయం ఎంతమాత్రం లేదని, తనకు ఆ విషయం తెలియదని, తెలిసి వుంటే ఆపేవాడినని ఈ విషయం చౌడేశ్వరి దేవి వద్ద ప్రమాణం కూడా చేశానని వివరించారు. తాను హింసను ప్రోత్సహించనని, శాంతినే ప్రోత్సహిస్తా నని స్పష్టం చేశారు. తాను ఇటీవల ఎక్సైజ్ పోలీసు స్టేషను కు వెళ్లింది కూడా కౌన్సిలర్ రావులకొల్లు అరుణ ఇంటి సమీపంలోని పేద వాడైన తొగట కులస్థుడి కోసమని, అతని తల్లి కర్మకాండ సమయంలో 7 ఫుల్ బాటిల్స్ తీసికొని వెళ్తే ఎక్సైజ్ పోలీసులు పట్టుకుంటే కౌన్సిలర్ భర్త నాగేంద్ర ను ఆశ్రయిస్తే, అతని మాట వినని పక్షంలో తానే స్వయంగా ఎక్సైజ్ పోలీసు స్టేషను కు వెళ్లి వారి తరపున మాట్లాడానని, ఆ సమయంలో దురుసుగా వ్యవహరించానని, తన మాటలకు క్షమాపణ చెప్పానని వివరించారు. ఈ విషయంలో తనపై కూడా కేసు నమోదైందని తెలిపారు. ఓటుకు, ఓటర్లకు రాచమల్లు సదా సేవకుడని తెలిపారు. ఇటీవల మహబూబ్ బాషా అనే వ్యక్తిని టిడిపి నాయకులు తిప్పిరెడ్డిపల్లె దస్తగిరి, అతని కుమారుడు వారికి గతంలో రావాల్సిన బాకీ విషయంలో దాడి చేసి, కిడ్నాప్ చేశారని, ఈ విషయమై మహబూబ్ బాషా కుటుంబ సభ్యులు ఫిర్యాదు తో పోలీసులు వారిని స్టేషన్ కు పిలిపిస్తే తిరిగి స్టేషన్ లో కూడా వారిపై దాడి చేశారని, తిరిగి వీరిపైనే కేసు నమోదు చేయలేదని ప్రవీణ్ స్టేషన్ లో నియమావళిని అతిక్రమించి నిరసన వ్యక్తం చేయడం దారుణమన్నారు. రాచమల్లు రాజ్యాంగం అంటారని, పోలీసులు తన మాటే వింటారని, అందులో భాగంగానే అతనిపై అక్రమ కేసులు నమోదు చేశారని పేర్కొనడం సరికాదని, ప్రవీణ్ లోకేష్ మాట విని టికెట్ కోసం కేసులు పెట్టేలా చేస్తున్నారని విమర్శించారు. జిల్లా ఎస్పీ, పోలీసులు నిష్పక్షపాతముగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కావున ప్రజలు రెండు కన్నులతో ప్రవీణ్ అబద్దాలను గుర్తించాలని కోరారు. ప్రజలు నిజానిజాలు తెలుసుకుని సత్యం వైపు నిలవాలని, పోలీసులు నిష్పక్షపాతముగా వ్యవహరించి తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వివరించారు.

## ఆరోగ్యశ్రీ సేవలు ఇబ్బందులు లేకుండా చూడాలి : ఏఐటీయూసీ



**కడప సిటీ, జనవరి 25 (శ్రీచక్ర) :**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రిలు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపి వేస్తున్నట్లు చెప్పడంతో పేద, సామాన్య, మద్దతురగతి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే పెండింగ్లో ఉన్న ఆరోగ్యశ్రీ కి సంబంధించిన బిల్లులు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కడప రైల్వేస్టేషన్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ప్రవేటు ఆస్పత్రులకు రూ.50 నుంచి రూ.100 కోట్ల మేర ప్రభుత్వం నిధులు బకాయి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వేయి కోట్లకుపైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టింది.గత నెలలో సేవలు నిలిపి వే స్తామని ఆస్పత్రి యాజమాన్యాలు హెచ్చరించడంతో, కొంత వరకు పెండింగ్ బకాయిలు ప్రభుత్వం చెల్లించిందన్నారు. మిగిలి పోయిన బకాయిలు డిసెంబరు 31లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని,ప్రభుత్వం ఇచ్చిన హామీ రోజులు గడుస్తున్నా నెరవేరకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నా యన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలు గొప్పగా చేస్తున్నామని రెండు దపాలుగా తన సచివాలయ వాలంటీర్ల ద్వారా గుర్తింపు కార్డులు సరఫరా చేసి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. జనవరి 25 ఉదయం నుంచి కొత్తగా వచ్చే రోగులకు వైద్య సేవలను నిలుపుదల చేస్తున్నట్లు, రోగుల రిజిస్ట్రేషన్లు కూడా ఆపేస్తామని ఆస్పత్రుల ప్రతినిధులు చెబుతున్నారని ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపేయడం వల్ల పేద, మధ్యతరగతి, సామాన్య రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టారని, అత్యవసర శస్త్ర చికిత్సలను ఆరోగ్య శ్రీ పథకంలో చేయకుండా నిలిపేస్తే రోగులు మరింత ఇబ్బందిపడే అవకాశముంది,దీనిపై ప్రభుత్వం తక్షణమే తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో గూడ్సుల్ హనుమాన్ యూనియన్ నాయకులు మా భాష, చిన్న ఓబులేసు,సుబ్బారామ్, నాగేంద్ర,గంగయ్య, రంగ నాయకులు,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే చేయించి స్మశాన వాటిక స్థలంకు కాంపౌండ్ నిర్మించాలి

- చలమారెడ్డి పల్లె గ్రామ ప్రజలు



**కడప సిటీ, జనవరి 25 (శ్రీచక్ర) :**

కడప నగరం రెండో డివిజన్ పరిధిలో ఉన్న చలమారెడ్డి పల్లె స్మశాన వాటిక స్థలమును ఆ గ్రామ ప్రజలకే కేటాయించాలని, సర్వే చేయించి స్మశాన వాటికకు చుట్టూ కాంపౌండ్ నిర్మించాలని, గ్రామస్తులు బత్తల శ్రీనివాసులు, శివ, రవి నంద్యాల నాగ సుబ్బన్న, దేరంగుల ఎర్రన్న, రమణయ్య నాయుడు, శివరామకృష్ణ నాయుడు , హనుమంతు నాయుడు, వెంకటసుబ్బయ్య, మహేష్, ఓబుల్ రెడ్డి, హనుమంతు తదితరులు కోరారు. గురువారం స్మశాన వాటిక స్థలం వద్ద గ్రామస్తులు 100 మందికి పైగా పురుషులు నిరసన వ్యక్తం చేశారు. రెండవ డివిజన్లో చాలా ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ తమకు కేటాయించిన స్మశాన వాటిక స్థలంలోనే ఎస్సీ, ఎస్టీలకు కూడా 50 సెంట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్పడం సమంజసంగా లేదన్నారు. గత 130 సంవత్సరాల నుండి మా తాత ముత్తాతల కాలం నుండి మా చలమారెడ్డి పల్లె గ్రామస్తులకు ఆ స్మశాన వాటికే దిక్కని కాబట్టి ఆ స్థలాన్ని మా గ్రామస్తులకే కేటాయించాలాన్నారు. అదేవిధంగా స్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో కబ్జాకు గురైందని, గనుక సర్వే చేయించి కాంపౌండ్ నిర్మించాలన్నారు. నాలుగు ఎకరాల 75 సెంట్లు స్మశానానికి భూమి ఉందని తమ పూర్వీకుల నుండి తమ పెద్దలు వరకు ఉంది అని చెప్పడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం మూడు ఎకరాల 77 సెంట్లు చలమారెడ్డి పల్లె స్మశాన వాటికకు కేటాయించినట్టు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులంతా కలిసి రెవెన్యూ అధికారులను మరలా ఒక్కొక్కసారి సర్వే చేయించి, మా స్మశాన వాటికకు గతంలో ఎంతైతే భూమి ఉందో అంత ఇప్పించగలరని మనవి చేశారు.

## పెద్దమ్మ, చిన్నమ్మ దేవస్థానం వద్ద అన్నదానం

**ప్రొద్దుటూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

పౌర్ణమి సందర్భంగా బిసి రాష్ట్ర నాయకులు మరియు ప్రొద్దుటూరు కృష్ణాలయ కమిటీ చైర్మన్ షూటింగ్ బాల్ కడప జిల్లా అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మైదుకూరు రోడ్డులోని టూటౌన్ బైపాస్ వద్ద గల శ్రీశ్రీశ్రీ చిన్నమ్మ తల్లి పెద్దమ్మ తల్లి చెట్టు వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలకు బెల్లం పాయసం, చిత్రాన్నం, పప్పు, అన్నం, మజ్జిగ పులుసు, దాదాపు 300 మందికి రుచికరమైన భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ తనకు వున్నంతలో ఇతరులకు సేవ చేయడానికే తాను ఇష్టపడతానని వివరించారు. ప్రొద్దుటూరు పట్టణానికి ప్రతి నిత్యం ఎందరో ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తారని, అందులో పేదవారి గురించి ఆలోచించి తాను గత 2 సంవత్సరములుగా తాను అన్నదానం కొనసాగిస్తున్నానని, తన వలన ఒక పూట పదిమంది ఆకలి తీరినా ఆనందమే అని వివరించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, సీతంపల్లి రమణ, బంగి శివప్రసాద్, సోమాపురం చక్రవర్తి యాదవ్, నేలటూరు సంజీవ్ రాయుడు యాదవ్, నల్లం రవిశంకర్, జయచంద్ర యాదవ్, ఈశ్వర్ రెడ్డి, యేసు నాథ్ రెడ్డి, హరీష్, గంగాధర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీచక్ర

శుక్రవారం । జనవరి । 26 । 2024
Friday । 26 । January । 2024
email: sreechakratelugu@gmail.com



# చిమ్మ చీకట్లో ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్



**ఒంగోలు, జనవరి 25 (శ్రీచక్ర) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ స్మృతి వనంలో స్వయాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిచే, అంబేద్కర్ విగ్రహం, ప్రారంభించడం జరిగింది. తదుపరి, గత మూడు రోజులుగా విద్యుత్ లేక చిమ్మ చీకటిలో ఉంది, కనుక తక్షణమే అధికారులు స్పందించి విద్యుత్ను ఏర్పాటు చేయాలని, అందరి ఆరాధ్య దైవమైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని విద్యుత్ వెలుగులో చూడాలని, నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**కనిగిరి, జనవరి 25 (శ్రీచక్ర) :**

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగ ఫలితంగా భారతదేశం 1947 ఆగస్టు 15న పరాయి పాలకుల దాస్య శృంఖలాల నుండి స్వాతంత్రాన్ని పొంది 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. భారతదేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జనవరి 26వ తేదీన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అప్పటినుండి ప్రతి సంవత్సరము జనవరి 26న గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్నామని దారపనేని పేర్కొన్నారు.

## సమాజ్వాదీని బలోపేతం చేయడానికి బహుజనులు ముందుకు రావాలి

- ఏపీ సమాజ్వాదీ పార్టీ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు



**ఒంగోలు, జనవరి 25 (శ్రీచక్ర) :**

మతోన్మాద బీజేపీకి తొత్తులుగా మారిన ఏపీలోని మూడు ప్రదాన పార్టీలైన తెలుగుదేశం, వైసిపి, జనసేన పార్టీలకు ప్రత్యామ్నాయంగా సమాజ్వాదీ పార్టీని రాష్ట్ర ప్రజలంతా ఆదరించాలని ఆంధ్రప్రదేశ్ సమాజ్వాదీ పార్టీ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రాయలసీమ పర్యటనలో బాగంగా కొలిమిగుండ్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ముందుగా ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం విజయవంతం ఔతుందని... బహుజనులకు అసలైన ఆయుదంగా ఓటును వినియోగించుకోవాలని కోరారు. కొలిమిగుండ్ల పోతిరెడ్డి.వెంకటసుబ్బారెడ్డి ఆహ్వానం మేరకు తేనేటి విందుకు హాజరై విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయడానికి సమాజ్వాదీ కేడర్ సిద్ధంగా ఉందని తెలిపారు. సమాజ్వాదీ రాయలసీమ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ పాండురంగయాదవ్ మాట్లాడుతూ రాయలసీమలో రెండు పార్టీలు కేవలం రెండు సామాజికవర్గాలకే ప్రాదాన్యత ఇస్తున్నాయని... సామాజికన్యాయం ఎలా ఉండాలో సమాజ్వాదీ చాటిచెప్పబోతోందని... వచ్చే ఎన్నికల్లో బహుజనులంతా సమాజ్వాదీకి అండగా నిలవాలని కోరారు. నంద్యాల జిల్లా అద్యక్షుడు పెరుగు.శివకృష్ణయాదవ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో సమాజ్వాదీ పార్టీ ప్రదాన పార్టీలకు దీటుగా ఉందని తెలిపారు. పోతిరెడ్డి.వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ పర్యటనలో బాగంగా నా ఆతిథ్యం స్వీకరించిన సమాజ్వాదీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. సమాజ్వాదీ అన్ని వర్గాలకు ప్రాదాన్యత ఇస్తుందని... రాబోయే రోజుల్లో తన అనుచరులతో, శ్రేయోభిలాషులతో చర్చించి కచ్చితంగా ఒక నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. సమాజ్వాదీ అద్యక్షుడు పాశం.వెంకటేశ్వర్లు వెంట రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ సిద్దపు. పాండురంగయాదవ్, నంద్యాల జిల్లా అద్యక్షుడు పెరుగు.శివకృష్ణయాదవ్, ములాయం బ్రిగేడ్ అద్యక్షుడు కళ్యాణ్ కుమార్, ప్రొద్దుటూరు ఇన్చార్జ్ పెద్దన్న, మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్. ఫరీదాబీ మరియు సమాజ్వాదీ అభిమానులు, పోతిరెడ్డి.వెంకటసుబ్బారెడ్డి అనుచరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 27న కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన



**ఒంగోలు, జనవరి (శ్రీచక్ర) :**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఈనెల 27వ తేదీన ఒంగోలు వస్తున న్నట్లు, మాజీ ఎంపీటీసీ మరియు కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు బొడ్డు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు .విష్ణు ప్రియ కన్వెన్షన్ హాల్ నందు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశానికి వైఎస్ షర్మిల తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, ఒంగోలు వస్తున్నట్లు బొడ్డు సతీష్ తెలిపారు .కనుక ఈ కార్యక్రమానికి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేసినారు.

## మీ సంక్షేమం మా బాధ్యత

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి
- వంగల్లులో రూ.10 కోట్లతో సంక్షేమాభివృద్ధి పనులు
- అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి
- సచివాలయాన్ని నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- విజయీభవ యాత్రకు ఘన స్వాగతం పలికిన ప్రజలు

**సంగం, జనవరి 25 (శ్రీచక్ర) :**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రజలందరికి సంక్షేమాభివృద్ధిని అందించే బాధ్యత మాపై ఉందని, అలాంటి సంక్షేమాభివృద్ధిని ప్రజలందరికి మళ్లీ అందించాలంటే సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ మళ్లీ ఆశీర్వదించి జగనన్న ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. గురువారం సంగం మండలం వంగల్లులో విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే మేకపాటికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఎమ్మెల్యే మేకపాటిని ఆశీర్వదిస్తూ తమ గ్రామంలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయీభవ యాత్రలో సాగుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రజలను జగనన్న సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలంటూ ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలోని ఓ టిఫెన్ దుకాణంలో కార్యకర్తలతో కలసి టిఫెన్ రుచి చూసిన ఎమ్మెల్యే మేకపాటి చాలా బాగున్నాయంటూ పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పలువురు ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ప్రచారరథంపై విజయీభవయాత్రలో సాగిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి బహిరంగసభలో మాట్లాడారు.గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా ఇలా ప్రతి గ్రామానికి స్వపరిపాలన అందించే విధంగా వ్యవస్థలు ఏర్పాటు చేయలేదని, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, మిల్క్ చిల్లింగ్ సెంటర్, నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధిలాంటి పథకాలను ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టి మండలస్థాయిలో ఉండే అధికారాలను గ్రామస్థాయికి తెచ్చి ప్రజలకు సేవే చేసేలా ఏర్పాటు చేశారని అన్నారు. ప్రతి గ్రామంలో జగనన్న ఏర్పాటు చేసిన వ్యవస్థల ద్వారా ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా ప్రజలందరి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందాయని, గ్రామాల్లో జరుగుతున్న మార్పును ప్రజలందరూ గమనించాలని కోరారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో నాల్గవ విడతలో రూ.6వేల కోట్లు ముఖ్యమంత్రి జగనన్న అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారని పేర్కొన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వంలో పాలనకు, జగనన్న సంక్షేమ పాలనకు ప్రజలే వ్యత్యాసాన్ని గమనించాలని, 600 హామిలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా గత ప్రభుత్వం పాలన సాగించిందని, మెనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామిని నేరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్న పాలనను ప్రజలంతా కళ్లారా చూశారని, ఇలాంటి ముఖ్యమంత్రిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులతో వంగల్లు గ్రామంలో అనేక మంది రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయని, వంగల్లు గ్రామంలో జగనన్న రూ.10 కోట్ల సంక్షేమాభివృద్ధి పథకాలను అందచేశారని, గత ప్రభుత్వంలో ఇంతటి సంక్షేమం జరిగిందా అని ప్రశ్నించారు. జలకళ పథకం ద్వారా బోర్లు మంజూరు చేయడం జరిగిందని, ఇళ్ల నిర్మాణంలో గృహాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ.26లక్షలను అభివృద్ధి పనులకు ఇప్పటికే అందచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం సమస్యా నమోదు పుస్తకాన్ని ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామంలో తెలిపిన సమస్యలను చాలా వరకు పరిష్కరించడం జరిగిందని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాలంటీర్ ద్వారా సచివాలయానికి తెలియచేస్తే మా దృష్టికి వస్తుందని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జగనన్న పాలనలో ప్రజలకు సేవలందించేందుకు శాశ్వత ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చే మన ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి అవసరమైన పూర్తిస్థాయి మౌళిక వసతులు కల్పిస్తామని, మెనిఫెస్టో ఏర్పాటు చేసి ప్రతి హామిని నెరవేరుస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనన్ని ఎమ్మెల్యేమేకపాటి విక్రమ్ రెడ్డి ప్రారంభించి ప్రజలందరూ ఈ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీ ఇంటికి సంక్షేమం అందితేనే, ప్రతి ఒక్కరికి మంచి జరిగితేనే నాకు ఓటేయ్యండి అని జగనన్న ప్రజలందరిని కోరుతున్నారని, అలా ధైర్యంగా నేను చూసిన మంచిని చూసి ఓటేయ్యండి అని కోరే నాయకుడు దేశంలో ఒక్క మన జగనన్నే అని, ఆయనను మరోమారు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. రఘునాథ రెడ్డి శంకర్ రెడ్డి. మోహన్ రెడ్డి. మెట్టుకూరు వాసుదేవ రెడ్డి. చంద్రశేఖరయ్య. నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయుల సమావేశంలో పాల్గొన్న దారపనేని



**కనిగిరి, జనవరి 25 (శ్రీచక్ర) :**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం, జంగాలపల్లె గ్రామాల నుండి వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆత్మీయుల సమావేశంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారందరూ దారపనేనితో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీ నిర్ణయం పైనే మేమంతా నడుచుకుంటామని, గత 50 సంవత్సరాల నుండి రాజకీయాలలో మేమంతా మీరు చూపిన బాటలోనే నడిచామని మా శ్రేయోభిలాషిగా మీ నిర్ణయమే మా నిర్ణయం గా భావిస్తామని తెలిపారు. తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీలు చెనికల పెద్దమాల కొండయ్య, చెని కల వెంగమ్మ, డబ్బు కొట్టు ఆది లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ మానం గురువయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, చెనికల చినమాల కొండయ్య, మాల కొండయ్య చెనికల మాల కొండయ్య (పెద్దాయన) చెనికల నాగేశ్వరరావు, మానం మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్, బొడ్డు సుధాకర్ అండ్ బ్రదర్స్, మానం వెంగళరావు (రెడ్డి) చెనికల వెంకటేశ్వరరావు (బచ్చు) చెనికల మనోజ్, నాగార్జున, రమణ, ఆవులయ్య, ఆవులయ్య తదితరులు ముక్తకంఠంతో దారపనేనికి తెలిపారు.

## జాతీయ జెండాను గౌరవించాలి



**కనిగిరి, జనవరి 25 (శ్రీచక్ర) :**

సమగ్ర శిక్ష అభియాన్,కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా,జాతీయ గౌరవ చిహ్నాల పరిరక్షణ చట్టం 1971 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ కఫార్ మాట్లాడుతూ జాతీయ జెండాను గౌరవించాలని అన్నారు.జాతీయ గౌరవ చిహ్నాల పరిరక్షణ చట్టం 1971 లోని నిబంధనల ప్రకారం జాతీయ జెండాను అవమానపరిస్తే మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షలేదా జరిమానా విధిస్తారని అన్నారు. ప్లాస్టిక్తో తయారు చేసిన భారత జాతీయ జెండాను ఉపయోగించకుండా ఉండాలని ప్రతి ఒక్కరూ కాగితపు జాతీయ జెండాలను ఉపయోగిస్తూ ఫ్లాగ్ కోడ్ను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, వక్తలు మాట్లాడుతూ భారత జాతీయ జెండాను పారవేసే నియమాలను అనుసరించడం ద్వారా భారతదేశ జాతీయ జెండా గౌరవించాలని ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా,2022లో పేర్కొన్న నిబంధనల ప్రకారం దెబ్బతిన్న జాతీయ పతకాన్ని రెండు పద్దతుల ద్వారా గౌరవంగా పారేయాలని దహనం చేయడం లేదా పాతి పెట్టడం ద్వారా గౌరవంగా పారేయాలని తెలిపారు. అగ్నిని ముందుగా ఏర్పాటు చేసి మంటల మధ్య జెండాను జాగ్రత్తగా మంటల మధ్య ఉంచి కాల్చాలి.జెండాను మడతపెట్టకుండా ముందుగా అగ్నిని నిర్మించకుండా కాల్చడం,జెండాకు ముందుగా నిప్పు పెట్టడం నేరాలుగా భావించాల్సి ఉంటుందని జాతీయ జెండా మన దేశాని గర్వకారణమని దానిని పారేసేటప్పుడు కూడా ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సి ఉంటుందని అవగాహన కలిగించారు.కనిగిరి మండల అభివృద్ధి అధికారి జె బి మల్లికార్జునరావు, పీసీ పల్లి మండల విద్యాధికారి,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్,పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు,వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యరావు, కౌన్సిలర్ ఎర్రబెల్లి దేవరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒంగోలులో ఆకట్టుకున్న ఓటు హక్కు ప్రత్యేక శకటం




**ఒంగోలు, జనవరి 25 (శ్రీచక్ర) :**

ఒంగోలులో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ,ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శకటాన్ని ప్రదర్శించారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు కమి షనర్ వెంకటేశ్వర ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియ జేస్తూ ర్యాలీ నిర్వహించగా ఓటు విలువను ,తెలియజేసే ప్రత్యేక శకటం అందరిని ఆకర్షించింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలియజేసినారు.

# చేప పిల్లలు పెంపకం పంచాయతీకి ఆసార

**బాలాయపల్లి, జనవరి 25 (శ్రీచక్ర) :**

చేప పిల్లలు పెంపకం చేయడంతో పంచాయితీకీ ఆర్థికం ఉపయోగపడుతుందని గొట్టికాడు గ్రామ సర్పంచ్ వెందోటి సుప్రజ పేర్కొన్నారు.గురువారం మండలంలోని గొట్టికాడు గ్రామం చెరువు లో ప్రధానమంత్రి మత్స్య సంపదన యోజన పథకం ద్వారా 80 వేలు చేపపిల్లలను వదిలారు. ఈసంద ర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామంలోని చెరువులో రెండు రకాల బొచ్చా, గెండి చేప పిల్లల వదలడం జరిగిందన్నారు. ప్రభుత్వం గిరిజనులను ఆదుకు నేందుకు సొసైటీల ద్వారా చేపలు వదలడం జరిగిందన్నారం. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గిరిజనుల కుటుంబాల సంరక్షణ కోసం వారికి ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు.ఈ పథకం వల్ల పేద గిరిజ నులకు లబ్ధి చేకూరుటమే కాకుండా స్థానిక ప్రజల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగ మించే వీలుందన్నారు చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యకర సమాజం ఏర్పడు తుందన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్ ఓ శ్రీనివా సులు, సొసైటీ సభ్యులు అద్దూరు చెంచయ్య, కరణం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

● సైబర్ నేరాలపై అవగాహన



**సూళ్లూరుపేట ప్రతినిధి, జనవరి 25 (శ్రీచక్ర) :**

సూళ్లూరుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాధికులకు అవగాహనా సదస్సు నిర్వహించారు, ట్రైనీ (డి.ఎస్.పి) సింధు ప్రియా , (ఎ.పి.పి)ప్రకృతి కుమార్ ఈ అవగాహనా సదస్సులో పాల్గొన్నారు, విద్యార్థినులకు చదువు పట్ల,సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు, విద్యార్థులందరూ బాగా చదివి పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రుల కు ఉపాధ్యాయులకు ఆనందాన్ని, సంతోషాన్ని కల్పించాలని. ఆశించారు ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన్న తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



**గూడూరు రూరల్, జనవరి 25 (శ్రీచక్ర) :**

ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వివిధ రంగాల అధికారుల పాల్గొన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో గూడూరు అర్బన్ మండలం బిజెపి అధ్యక్షులు ఆరికట్ల బాలకృష్ణ నాయుడు జిల్లా బిజెపి సెక్రటరీ బిందు రెడ్డి గూడూరు నియోజకవర్గ కో కన్వీనర్ కుంటా నరేంద్ర కుమార్ టౌన్ జనరల్ సెక్రటరీ గుంజి శ్రీనివాసులు ఉపాధ్యక్షులు ఇమ్మడి శెట్టి సురేష్ బాబు కిసాన్ మోర్చ జనరల్ సెక్రెటరీ గాలి ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రంగవల్లి పోటీలు



**బాలాయపల్లి, జనవరి 25 (శ్రీచక్ర) :**

గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామములో ఉన్న వెందోటి సౌజన్య రెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠ శాలలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా గురు వారం విద్యార్థులకు రంగవల్లి పోటీలు ఆ పాఠశాల కరస్పాండెంట్ దానం జయలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ తత్వం ఉంటేనే ఉన్నత స్థానంకి చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులకు పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైన ఉందని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులను పోటితత్వంలో పాల్గొన్నందుకు అవగాహన కల్పించి వారిని ప్రతి పోటీల్లో పాల్గొనేలా ప్రత్యేక మైన చర్యలు చేపటాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. రంగవల్లి పోటీలో విజయం సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరుగు తుందన్నారు.ఇక రంగవల్లి పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి జ్యోతి, నోసిన మధురవాణి, సద్దుకూటి గౌతమి, నర్రెడ్ల మంజుల, నర్రావూల చెంచమ్మ, దానం మానస స్పందన, పాఠశాల ప్రిన్సిపాల్ దానం సురేంద్రబాబు. తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను సన్మానించిన వైసీపీ నేతలు

**సూళ్లూరుపేట ప్రతినిధి, జనవరి 25(శ్రీచక్ర) :**



సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జలదంకి మదన్ మోహన్ రెడ్డి, తంబి రెడ్డి సురేష్ రెడ్డిలు సన్మానించారు. గురువారం వారు నెల్లూరులోని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు శాలువాలు కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే సంజీవ య్యను మూడవసారి సూళ్లూరుపేట నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో వారు ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కల్లబొల్లి మాటలకు మోసపోయారు : కురుగొండ్ల



**బాలాయపల్లి, జనవరి 25(శ్రీచక్ర) :**

రాష్ట్ర ప్రజలు జగన్ మోహన్ రెడ్డి చెప్పిన కల్లా బొల్లి మాటలకు మోసపోయి ఓట్లు వేసి గెలిపిం చారని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు.గురువారం మండల కేంద్రంలో జయహో బిసి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా బిడ్డలు బాగుప డాలన్న ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలన్నారు. 2014 నుంచి 2019 వరకు అభివృద్ధి చేసి చూపించాం. జగన్ ప్రభుత్వం వచ్చి 4 ఏళ్ల 8 నెలలు పూర్తయింది. కనీసం ఏ గ్రామంలోనైనా తట్టడం మట్టేసిన సంఘటన ఉందా అని ప్రశ్నించారు.కల్ల బొల్లి మాటలకు బిసిలు మోస పోయారు.దింతో జగన్ గలిశారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే తెలుగుదేశంను గెలిపిం చాలని కోవాలని కోరారు. హైదరాబాద్ ని సింగపూర్ లాగా గెలిపించిన విషయం మీకు అందరికీ తెలిసిందే. బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిడ అమరావతి అలా అభివృద్ధి చేస్తారని తెలిపారు.

**రాజకీయ గుర్తింపు ఎన్టీఆర్ సర్వే..**

బడుగు బలహీన వర్గాలకు రాజకీయ గుర్తింపు ఇచ్చింది మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని తిరుపతి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి.సధశివం అన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది వందల అరవై మూడు మండలాల్లో ఉన్న బీసీలు పూర్తిగా నష్టం జరిగిందన్నారు.నందమూరి తారక రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. ఇక నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత 14% బీసీలకు రిజర్వేషన్ కల్పించారు.దింతొ బిసిలకు 34% రిజర్వేషన్ ఉండేదన్నారు రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి సీఎం అయిన వెంటనే 34 శాతం ఉన్నారు 24 శాతం రిజర్వేషన్ చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు కేటాయించిన రూ 75 వేల కోట్లను దారి మళ్లాయని మండిపడ్డారు. ఈ 4 ఏళ్లలో బీసీలకు ఒక్క రూపాయి రుణం ఇచ్చిన ధఖలాలు లేవన్నారు. కార్పొరేషన్లు మోసం చేసి పథకాల పేరుతో బీసీలను ఎస్సీ ఎస్టీలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు మండిపడ్డారు రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి వచ్చినప్పటి నుంచి పేదలు దూరమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సత్యం నాయుడు రామచందర్ నాయుడు సి బి కే ఎన్ సిసి నాయుడు నర్సింహులు నాయుడు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ హరి, చిత్తూరు ఈశ్వరయ్య, దాసరి రాజగోపాల్ నాయుడు దాసరి ప్రభాకర్ నాయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు జనసేన వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ గూడూరు వెంకటేశ్వర్లు రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు మునస్వామి జడపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ గురుమూర్తి ఆత్మీయ సమావేశం



**వరదయ్యపాలెం, జనవరి 25 (శ్రీచక్ర) :**

వరదయ్యపాలెం విచ్చేసిన తిరుపతి ఎంపీ గురుమూర్తికి,దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.వరదయ్యపాలెం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి సమావేశం నిర్వహించారు.తనకు ప్రజలు కల్పించిన అవకాశం ద్వారా ప్రజల సమస్యలను పార్లమెంట్లో వినిపించి,సమస్యల పరిష్కారం కోసం అందివచ్చిన ప్రతి చిన్న అవకాశంను కూడా సద్వినియోగం చేసుకున్నానన్న తృప్తి తనకు ఉందని తెలిపారు.ప్రజలు తరపున ఈ అవకాశం కల్పించిన తిరుపతి పార్లమెంట్ ప్రజలకు,వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రానున్న ఎన్నికలలో తనను సత్యవేడు నియోజకవర్గం సమన్వయకర్తగా భాధ్యతలు అప్పగించారని,జగన్ మోహన్ రెడ్డి నిర్ణయంను తాను తూచ పాటించక తప్పదని,అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.త్వరలో తిరుపతిలోను,తాడేపల్లిలోను ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడే అవకాశం ఉందని,అందుకు జగన్ అభిమానులు సిద్దంగా ఉండాలి అని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మండలం లోని వైసీపీ నాయకులు శాలవాలతో సత్కరించారు.రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు,ఎంపీపీ భర్త దామోదర్ రెడ్డి,మండల,నియోజకవర్గం,జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# రీసర్వేపై నెల్లటూరులో రెవెన్యూ గ్రామసభ



**వరదయ్యపాలెం, జనవరి 25(శ్రీచక్ర) :**

వరదయ్యపాలెం మండలం,కడూరు సచివాలయం పరిధిలోని నెలటూరు గ్రామం నందు రీసర్వే తహశీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు సర్వేలో పొందుపరచిన వివరాలను తెలియజేశారు. రైతులు తమ సందేహాలను, అనుమానాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.రెవెన్యూ అధికారులు రైతుల సందేహాలను, అనుమానాలను నివృత్తి చేశారు.ఇందులో భాగంగా అంకం వెంకటరమణయ్య కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని,వేరొకరి పేరుతో ఉందని నోటీసులో కనబరచడం జరిగింది.దాన్ని రెవెన్యూ రికార్డులో సరిచేసి వెంకటరమణయ్య పేరుతో నమోదు చేయాలని,అందుకు సంబంధించిన కొన్ని ఆధారాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు.పరిశీలించి నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు రైతుకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, స్థానిక విఆర్వో మాధవి,సచివాలయం సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# సమగ్ర విద్యా సమాచార బుక్‌లెట్

**అమరావతి,జనవరి25(శ్రీచక్ర) :**

ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకువచ్చిన విప్ల వాత్మక మార్పులు యునైటెడ్ నేషన్స్ లక్ష్యాలకు చేరువలో ఉన్నాయని ఐక్యరాజ్య సమి తి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ చెప్పారు. రాష్ట్రంలో అమ లు చేస్తున్న విద్యా సంస్కరణలు, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంపై షకిన్ కూమార్ రూపొందించిన సమగ్ర సమాచార బుక్‌లెట్‌ను తిరుపతిలో జరిగిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సదస్సులో సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. గత సెప్టెంబర్‌లో పది మంది పేద విద్యార్థులను ఐక్యరాజ్యసమితికి తీసుకువెళ్లడంపై షకిన్ కుమార్‌ను సీఎం జగన్ అభినందించారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులను ఉన్న తంగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని షకిన్ పేర్కొన్నారు. జగ నన్న విదేశీ విద్యా దీవెన పథకం, అర్హతలు, దరఖాస్తు విధానం, అందించే కోర్సులు, డాక్యుమెంట్స్ చెక్‌లిస్ట్, అప్లికేషన్ స్టేటస్ చెకింగ్, అక్రిడేషన్, యూనివర్సిటీల జాబితా వంటి సమస్త సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచినట్టు వివరించారు.

# టీడీపీతోనే మహిళలకు సంక్షేమం, అభివృద్ధి

- తెలుగుదేశం పార్టీలో చేరిన 22వ వార్డు మహిళలు
- కర్నూలు టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్

**కర్నూలు, జనవరి 25(శ్రీచక్ర) :**




తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మహిళలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటాయని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. గురువారం నగరంలోని 22వ వార్డు అరోరా నగర్‌కు చెందిన మహిళలు మౌర్య ఇన్‌లో టి.జి భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టి.జి భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టి.జి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రోజురోజుకూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1500 అందించడంతో పాటు ఎన్నో మంచి పథకాలు టిడిపి మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. కర్నూల్లో తనను గెలిపిస్తే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కర్నూల్లోని అన్ని ప్రాంతాల ప్రజలు తనకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందని టి.జి భరత్ అన్నారు. పార్టీలో చేరిన వారిలో భవానీ, శారద, సుధ, లక్ష్మీదేవి, ఎంజెలి, ఇందిర, మధులత, కావేరి, సుబ్బమ్మ, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నేతలు శ్రీధర్, విష్ణు, వంశీ, వనిత, దీపిక, చైతన్య పాల్గొన్నారు.

## సామాజిక సాధికార బస్సుయాత్రపై సమీక్ష సమావేశం



**కోట, జనవరి 25(శ్రీచక్ర) :**

కోట పట్టణంలో ఏ.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఈ నెల 28వ తేదీన కోటలో జరిగే సామాజిక సాధికార బస్ యాత్రకి సంబంధించిన విషయంపై స్థానిక వైసీపీ నాయకులతో ఎమ్మెల్సీ మేరిగ.మురళి బల్లి కళ్యాణ్ చక్రవర్తి లు సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు స్థానిక వైసీపీ నాయకులతో మాట్లాడుతూ 28వ తేదీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయడానికి ప్రతి వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని వైసీపీ అభిమానులకు అవగాహన కల్పించే విధంగా చైతన్య పరచాలన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ,ప్రభుత్వ విప్,గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ. మురళీధర్,రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి.వినోద్ కుమార్ రెడ్డి,వైసిపి కోట మండల కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి,చెందోడు వైసీపీ యువ నాయకులు చిల్లకూరు.సాయి ప్రసాద్ రెడ్డి,దేవారెడ్డి.నాగూర్ రెడ్డి,డీ ఆర్ అనుచరులు చేవూరు. నాగయ్య,వాకాడు ఏ ఎమ్ సీ డైరెక్టర్ గోనుపల్లి. మస్తానయ్య,శ్రీరామ్ గురు స్వామి,ఉలవకాయల.ప్రసాద్,మల్లు విజయ్ కుమార్ రెడ్డి,కోట,వాకాడు,చిట్టమూరు మండల వై.యస్.ఆర్.సి.పి నాయకులు,కన్వీనర్స్,తదితరులు పాల్గొన్నారు.

## కోట పోలీస్ స్టేషన్ డీఎస్పీ తనిఖీ




**కోట, జనవరి 25 (శ్రీచక్ర) :**

కోట మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి గురువారం తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కోట పోలీస్ స్టేషన్ లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు.అదేవిధంగా ప్రతి సంవత్సరానికి ఒకసారి సాధారణ తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి పలు విషయాలపై చర్చించడం జరిగింది. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో హలో గ్రామాల్లో వివాదాస్పదంగా ఉండే పలువురు రౌడీషీటర్‌లపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక వాకాడు సిఐ హరికృష్ణ,ఎస్సై నాగబాబులకు తెలిపారు. అదేవిధంగా గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వివాదాస్పదంగా ఉండే పలు పంచాయతీలోని రౌడీ షీటర్ లను బైండోవర్ చేసుకోవాలని తెలియజేయడం జరిగింది.

## రాయలసీమ రేంజ్‌లోని 47 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతులు

- కర్నూలు రేంజ్ డిఐజిఎస్. సెంథిల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐలు
- ప్రజలకు మంచి సేవలందించాలి



**కర్నూలు, జనవరి 25(శ్రీచక్ర) :**

రాయలసీమ రేంజ్‌లోని 47 మంది ఎస్సైలకు సిఐలుగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన సిఐలు గురువారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో డిఐజి ఎస్. సెంథిల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి మాట్లాడారు ప్రజల ధన, మాన, ప్రాణాలకు భరోసాగా నిలుస్తూ పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర స్పందన, బాధ్యతాయుతమైన సేవలే పరమావధిగా , రాబోయే ఎన్నికలలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రాయలసీమ రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతరపురం , సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ఎస్సైలు మరియు వివిధ లూప్ లైన్ ( విజిలెన్స్ %ఽ% ఎన్ ఫోర్స్ మెంట్ , ఎసిబి, టిటిడి, సిఐడి, రైల్వే, ఎస్ ఐ బి, ఎపి ట్రాన్స్ కో, పిటిసి) లలో పని చేస్తున్న ఎస్సైలు సిఐలుగా పదోన్నతి పొందారు. ఇందులో 2009 బ్యాచ్ కు చెందిన వారు ఎక్కువ శాతం ఉన్నారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పొత్తు ప్రజలే

- మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మగ్ధూమ్ మొహిద్దీన్




**గూడూరు, జనవరి 25(శ్రీచక్ర) :**

గూడూరు వైసీపీకి పొత్తులు అవసరం లేదని, రాష్ట్ర ప్రజలే వైసీపీకి పొత్తులని ఆ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ. మగ్ధూమ్ మొహిద్దీన్ అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని దర్గావీధిలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మగ్ధూమ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా జగన్ మోహన్ రెడ్డి వెంట ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా, అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రజలు ప్రతిపక్షాల గురించి మీ పొత్తుల గురించి బాగా అర్థం చేసుకున్నారని, కేవలం టీడీపీ నాయకులు లాభాపేక్ష కోసం పని చేస్తున్నారని, జగనన్న ఒక్కడే ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ను ముందుకు తీసుకు పోతున్నారని తెలిపారు. అలాగే ప్రతి పేద వాడి పిల్లల చదువుకు, వైద్యానికి పెద్ద పీట వేస్తూ రైతుల, మహిళల కష్టాలను దూరం చేస్తూ వారికి అండగా నిలిచిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. గూడూరు నియోజకవర్గంలోనూ గతంలో వైసీపీ సాధించిన ఓట్ల కంటే రెండింతలు మెజారిటీతో మేరిగ మురళీధర్ గెలవడం ఖాయమన్నారు. గూడూరు పట్టణ మైనారిటీ అధ్యక్షుడు జహీర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసిన ఏకైక నాయకుడు వైఎస్. జగన్మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. 175 సీట్లకు 175 సాధించి జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మగ్ధుమ్, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు జహీర్, యువత అధ్యక్షుడు బాబు, కార్యదర్శులు యస్దాన్, జమీర్, షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు ఎమ్మెల్యే టికెట్ సర్వేపై సహకరించిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ మేరీగ.మురళి

- కనీవినీ ఎరగని రీతిలో సామాజిక సాధికారిక బస్సు యాత్రను నిర్వహిస్తాం
- వైసీపీ నాయకులు పేర్నాటి. శ్యాంప్రసాద్ రెడ్డి వెల్లడి

**కోట, జనవరి 25 (శ్రీచక్ర) :**

గూడూరు వైసీపీ టికెట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి గూడూరు డివిజన్ పరిధిలో స్థానిక వైసీపీ నాయకులు సర్వేలో తమపై మంచి అభిప్రాయాన్ని తెలియజేయడం సంతోషదాయకంగా ఉందని ఎమ్మెల్సీ మేరీగా.మురళి అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని అల్లంపాడు గ్రామంలో పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి నివాస గృహంలో ఎమ్మెల్సీ మేరీగ. మురళితో ఆత్మీయ సమీక్షా సమావేశంను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ.మురళి మాట్లాడుతూ ప్రథమంగా ఎమ్మెల్యే టికెట్ పై తమ పేరు ఖరారు విషయంలో తూతూ మంత్రంగా ఉన్నప్పటికీ,కానీ సరైన సమయంలో తమ టిక్కెట్ పై శ్యామన్న నాకు మర్చిపోలేని సాయం అందించారని గుర్తు చేస్తూ జీవితంలో గుర్తుపెట్టుకుని ఉంటానని అన్నారు.తమ నడవడికను వైసీపీ అధిష్టానం గుర్తించి ఎమ్మెల్సీ స్థానం కల్పించి, వెంటనే విప్ బాధ్యతను కల్పిస్తూ కూడా ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా ఇంటికి చేయడం నా అదృష్టమని తెలిపారు. అదేవిధంగా గత టిడిపి ప్రభుత్వంలో పెన్షన్లుకు, ప్రస్తుత పెన్షనులకు ఎంత తేడా ఉందో ప్రజలు గమనించాలన్నారు. అదేవిధంగా గూడూరు డివిజన్లో కొంతమందిని ఉద్దేశించి మాట్లాడుతూ రాజకీయ బిక్ష పెట్టింది వైయస్ జగన్మోహన్ రెడ్డి అని,అలాంటి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరిచి చంద్రబాబు నాయుడు కాళ్ళ మీద పడిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి ని మాట్లాడే హక్కు లేదనివాపోయారు. నమ్మకద్రోహులను ఎప్పటికీ ప్రజానీకం నమ్మదని తెలిపారు.

**కనీవినీ ఎరగని రీతిలో సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేస్తాం**



ఈనెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు కోట పట్టణంలో బహిరంగంగా కనీవినీ ఎరగని రీతిలో సామాజిక సాధికారిక బస్సు యాత్రను నిర్వహిస్తామని వైసిపి రాష్ట్ర నాయకులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం అల్లంపాడులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలోనే కోట పట్టణంలో బస్సు యాత్ర జరిగినట్టు ఎక్కడా జరగనీ విధంగా నిర్వహించడం జరుగుతుందని ముక్తకంఠంగా చెప్పడం జరిగింది.గూడూరు డివిజన్ స్థాయిలో జరిగేటి వంటి ఈ కార్యక్రమానికి ఎస్సీ,ఎస్టీ బీసీలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రానున్న 2024 ఎన్నికల్లో గూడూరు డివిజన్ స్థాయిలో వైసిపి పార్టీ తరఫున మేరిగ.మురళిని గెలిపించుకోవాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ మీ కుటుంబానికి,మీ బిడ్డకు న్యాయం జరిగి ఉంటేనే 2024లో వైసీపీకి ఓటు వేయండి అని చెప్పే ధైర్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కును అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి,కోట మండల కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి,కోట బిట్ టు ఎంపీటీసీ షేక్.మొబిన్ భాష, యరటపల్లి.మధుసూదన్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్,కోట మండల ఉపాధ్యక్షుడు ఉప్పల. శేషయ్య గౌడ్,శ్రీరామ్ గురుస్వామి,ఉలవకాయల ప్రసాద్,ఉచ్చూరు.రవీంద్రా రెడ్డి,నేదురుమల్లి.హరీష్ చంద్రారెడ్డి,దువ్వూరు. రమణారెడ్డి,దువ్వూరు. సాయి కృష్ణారెడ్డి,పాదర్తి రాధాకృష్ణారెడ్డి,నరమాల రమణయ్య,తదితర వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేమంతా ఒక్కటే వైసీపీలో వర్గాలు లేవు...!

- కోట పట్టణంలో నడి బొడ్డున కాలిబాటతో ఎమ్మెల్సీ మేరిగ,నల్లపరెడ్డి,పేర్నాటి వర్గాలు

**కోట, జనవరి 25 (శ్రీచక్ర) :**



కోట పట్టణంలో గురువారం అందరిని ఆకట్టుకునే విధంగా ఎమ్మెల్సీ మేరీగా మురళితోపాటు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి వర్గం, కర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి వర్గం కలిసి కోట బజారులో కాలిబాటతో సామాజిక సాధికారిక బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించే సభా వేదిక విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా నాయకులు కాలిబాటతో నడుస్తూ ఉంటే కోట పట్టణంలోని వ్యాపారస్తులు, ప్రజలు ఉత్సాహంగా చూస్తూ ఉండిపోయారు. ఇలాగే వైసిపి పార్టీలో విభేదాలు లేకుండా కలిసి మెలిసి ఉంటే రాబోయే ఎన్నికల్లో గూడూరు అభ్యర్థి మేరీగా మురళి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడం తప్పదని స్థానికులు గుసగుసలాడుకున్నారు.

శ్రీచక్ర
రాజమండ్రి

# నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని, వార్డును అభివృద్ధి చేసాం





- నాడు నేడు కూడా తన హయాంలోనే భీమవరం నియోజకవర్గం అభివృద్ధి
- రాయలం గ్రామంలో 5 కోట్ల 47 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్‌లు ప్రారంభం
- రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్ద పీట వేసారని, ఇందులో భాగంగా గత నాలుగున్నర ఏళ్లుగా భీమవరం నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు . రాయలం గ్రామంలో 5 కోట్ల 47 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్లను, డ్రైన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం మరికొన్ని అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు నేడు కూడా భీమవరం నియోజవర్గం తన పరిపాలనలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం ఇంకా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ముందుగా రాయలం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద 51 లక్షల 20 వేలతో నిర్మించే సిసి రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి గుడి నుండి బైపాస్ రోడ్డుకు 77 లక్షలతో నిర్మించిన సీసీ డ్రై న్ ను ఆయన ప్రారంభించారు. పాత పంచాయతీ ఆఫీస్ నుండి బైపాస్ రోడ్డు వరకు 40 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, 45 లక్షల 90 వేల నిధులతో ఉప్పుగుంట చెరువు వద్ద నిర్మించిన సిసి రోడ్డు, డ్రై న్ను ఆయన ప్రారంభించారు. సర్రాజు గారి లే అవుట్ వద్ద 47 లక్షల 70 వేల నిధులతో నిర్మించిన సిసి రోడ్డును, 11 లక్షల 20వేల నిధులతో నిర్మించిన ఉప్పుగుంట చెరువు ఏరియా వద్ద సిసి రోడ్డు ఆయన ప్రారంభించారు. అదే మాదిరిగా కోటి 11 లక్షల 90 వేల నిధులతో సాయిబాబా గుడి వద్ద నిర్మించనున్న సిసి రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అదే మాదిరిగా సాయిబాబా గుడి వద్ద 11 లక్షల 20వేల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, గాంధీనగర్ వద్ద 16 లక్షల 30 వేల నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, 41 లక్షల 35 వేల తో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. కొమరాడ రోడ్డు ఏరియా వద్ద 93 లక్షల 70 వేల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపీడీవో వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ డిఇ స్వామి నాయుడు, చిన్నమిల్లి వెంకటరాయుడు, చిన్నమిల్లి నాగన్న, చిన్నమిల్లి శ్రీనివాస్, అడబాల అర్జున్ రావు, చెల్లబోయిన బుజ్జి, కండిబోయిన వాసు, కౌరు పాండురంగారావు, విప్పర్తి దొరబాబు, వీరమల్లు రాజకుమార్, యాడంగి రవి, చిన్నమిల్లి బాబి, ముందుండి అరుణ్ కుమారి, నవుడూరు ప్రసాద్, బడుగు అశోక్ కుమార్, కోమటి రాంబాబు, కోళ్ల బాలకృష్ణ, చిల్లీ వెంకటేష్, మోకా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## 'చిప్స్ టు స్టార్టప్' ఇనిషియేటివ్ ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్ట్

- రూపొందించిన శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ యొక్క ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం




**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్, భీమవరం, యొక్క ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా 'చిప్ టు స్టార్టప్' (సి2ఎస్) ఇనిషియేటివ్ కింద ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్ట్‌ను పొందడంలో విజయం సాధించడం పట్ల ప్రిన్సిపాల్ డా. జి . శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్ల కాలంలో 'మెమరీ-ఆప్టిమైజ్డ్ కో-ప్రాసెసింగ్ యూనిట్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ ఎడ్జ్ అభివృద్ధికి కళాశాలకు చెదిన ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ నాయకత్వం వహిస్తుంది అనే నమ్మకాన్ని వ్యక్తపరిచారు. ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్న పరిశోధకుల బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాసరాజు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రాజెక్ట్ చీఫ్ ఇన్వెస్టిగేటర్ మరియు విభాగాధిపతి డాక్టర్ కె . పద్మవాసవి, కో-చీఫ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం .వి . గణేశ్వరరావు, మరియు డాక్టర్. ఎం.వి. సుబ్బారావు, జి. చల్లారాంలు 'ఎడ్జ్ ఏ సామర్థ్యాలను మెరుగుపరచడానికి రూపొందిచే వినూత్న మెమరీ-ఆప్టిమైజ్డ్ కో-ప్రాసెసింగ్ యూనిట్‌ను అభివృద్ధి చేయడంలో కృషిచేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. డాక్టర్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఈ పరిశోధన ప్రాజెక్ట్ కళాశాల అధ్యాపకుల అంకితభావం మరియు నైపుణ్యానికి నిదర్శనమని, ఇది సాంకేతిక పరిజ్ఞానంలో స్వావలంబన సాధించడానికి ఓ గొప్ప మార్గంగా నిలుస్తుందని అన్నారు. మెమరీ-ఆప్టిమైజ్డ్ కో-ప్రాసెసింగ్ యూనిట్ అనేది ఎడ్జ్ ఏ అభివృద్ధి చేయడంలో కీలకమైన భాగం, ఇది హెల్త్‌కేర్, ఫైనాన్స్ మరియు మాన్యుఫ్యాక్చరింగ్‌తో సహా వివిధ రంగాలలో విస్తరించి ఉన్న అప్లికేషన్‌లతో కూడిన సాంకేతికత. శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ చేపట్టిన పరిశోధన కృత్రిమ మేధస్సు యొక్క భవిష్యత్తును రూపొందించడంలో మరియు రోజువారీ జీవితంలో దాని ఏకీకరణలో కీలక పాత్ర పోషిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ తెలియచేసారు.

## రాజమండ్రి సెంట్రల్ జైలును సందర్శించిన భీమవరం డిఎన్ఆర్‌లా కళాశాల విద్యార్థులు



**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

రాజమండ్రి సెంట్రల్ జైలును గురువారం భీమవరం డియన్.అర్ కాలేజీ ఆఫ్‌లా విద్యార్థులు సందర్శించారని డి యన్.ఆర్.లా కళాశాల ప్రిన్సిపాల్ డా. కే.రఘురాం,లెక్చరర్ చెల్ల బొయిన రంగారావుతెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు సూపింటెండెంట్ ఎస్.రాహుల్ విద్యార్దులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్య సదుపాయాలకు ఆసుపత్రి, అందరికీ ఒకే రకమైన భోజన సదుపాయాలు వాళ్ళకి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యను అభ్యించడం పరీక్షలు వాళ్ళతో రాయించడం వ్యాయామం చేయించడం అలాగే ప్రభుత్వం ద్వారా ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.. ఖైదీ లపై ఎటువంటి వివక్షత లేకుండా అందరినీ సమాన భావనతో చూడటం జరుగుతుంది. ఖైదీలకు వారి వృత్తి తగ్గ పనిని చేయించడం డబ్బులు ఇవ్వటం జరుగుతుంది. వాళ్లకు మానసిక వత్తిడి కలగకుండా ఉండటానికి పనులు చేయటం జరుగుతుందని అన్నారు. కాబోయే న్యాయ వాదులుగా మీరు కక్షి దారులపట్ల వివక్షత లేకుండా పెదవాళ్ళకి ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడం అలాగే పెదవాళ్ల తరుపున కేసులను వాదించాలని అన్నారు. ఈ పర్యవేక్షణలో డి యన్.ఆర్.లా కళాశాల ప్రిన్సిపాల్ డా. కే.రఘురాం, లెక్చరర్ చెల్ల బొయిన రంగారావు, అశోక్ చిత్రభాను, చౌదరి, వాణీ, స్వర్ణ, మంజు, స్వాతి, వీర్రాజు సందర్శించారు.

## వీరవాసరం మండలంలో ఘనంగా ఓటర్ల దినోత్సవం



**వీరవాసం, జనవరి 25 (శ్రీచక్ర) :**

వీరవాసరం మండలంలో గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల వద్దసీనియర్ సిటిజెన్లకు ఘన సన్మానం నిర్వహించారు. వడ్డీగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ సైదు శ్రీనివాసరావు,తోకలపూడిగ్రామంలో గ్రామ సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు,లు సీనియర్ సిటిజన్స్ లకు ఘన సన్మానం నిర్వహించారు.

## విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 'జాతీయ ఓటర్ల దినోత్సవం'




**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

డా. బి.వి.రాజు ఫౌండేషన్ మరియు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో గురువారం "జాతీయ ఓటర్ల దినోత్సవం" వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ దశిక సూర్యనారాయణ తెలియజేసారు. ఈ సందర్భంగా దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదిన "జాతీయ ఓటర్ల దినోత్సవం" ను జరుపుకుంటారని, అదేవిధంగా విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఈ రోజు ఓటు హక్కుపైనా, ప్రజా స్వామ్య వ్యవస్థపైనా, దేశాభివృద్ధిలో ఓటు శక్తి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్, డిబేట్, ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి ప్రత్యేక కార్యక్రమాలను కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఓటర్ల దినోత్సవం (ఎన్ .వి .డి ) ప్రతిజ్ఞలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, వివిధ విభాగాధిపతులు, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాము ఆఫీసర్ డాక్టర్ కె. గంగరాజు, బోధన మరియు సహాయక సిబ్బంది, పరిపాలనా సిబ్బంది, కళాశాల ఎన్ ఎస్ ఎస్ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

**హైదరాబాద్,జనవరి25(శ్రీచక్ర) :**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగనుంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో జరుగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హాజరుకానున్నారు. ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో ఎంపీలతో కేసీఆర్ చర్చించనున్నారు. తుంటి ఎముక ఆపరేషన్ చేసుకుని కోలుకుంటున్న కెసిఆర్ తన ఫామ్‌హౌజ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడే సమావేశం ఏర్పాటు చేశారు.

## శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి 5 గ్రాములు బంగారం వితరణ



**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి గురువారం భీమవరం పట్టణానికి చెందిన ముదునూరి భవాని 5 గ్రాములు బంగారాన్ని కానుగ సమర్పించారు. దాతలకు ఆలయ ప్రధాన పూజారి మద్దిరాల మల్లికార్జున శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ బాబురావు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

## రాయకుదురులో విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ గెడ్డం భారతిభాస్కరరావు



**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు గురువారం విద్యార్థులకు ట్యాబ్ లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి భాస్కరరావు, స్కూల్ చైర్మన్ గుబ్బల సత్యనారయణ , హెచ్‌ఎం , గెడ్డం ముసలయ్య , కమిటీ సభ్యులు, టీచర్స్, విద్యార్దులు పాల్గోన్నారు.

# ఓటు వజ్రాయుధం లాంటిది










- **ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి పరిపాలన పొందగలుగుతాము**
- **జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**
- **భీమవరం బివి. రాజు కళాశాలలో ఓటర్ల దినోత్సవం**

**భీమవరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

ఓటు హక్కు వినియోగంతో సుపరిపాలన సాధ్యంఅని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక బివి రాజు కళాశాల నందు రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఓటు హక్కు అవగాహన పై ఏర్పాటు చేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం బీవీరాజ్ కళాశాల ప్రధాన ద్వారం నుండి ఆడిటోరియం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రజలులతో నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, భీమవరం ఆర్టీవో కె.శ్రీనివాసులు రాజు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జ్యోతి ప్రజ్వలన చేసే ప్రారంభించారు. జాగృతి టీమ్ ఎలక్షన్ థీమ్, జె లాస్య టీం జయహెూ, ఉదయ్ టీ ఇండియా వాలే నృత్య ప్రదర్శనలు ఆహుతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఓటు హక్కు వినియోగంపై సందేశాన్ని వర్చువల్ గా అందరూ తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించడం ద్వారా వారు కోరిన పరిపాలనను పొందవచ్చునన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్.వి.డి.ఎ కార్యక్రమాలు జరుగుచున్నాయని, కానీ జిల్లా కార్యక్రమాన్ని విద్యాసంస్థలో ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యువత ద్వారా విలువలతో కూడిన మంచి సందేశాన్ని అందించడమే అన్నారు. మన రాజ్యాంగం రూపొందిందే ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కల్పించడానికి అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందడంతో పాటు, వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. రాజ్యాంగం నియమ, నిబంధనల ప్రకారం ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి పరిపాలన పొందగలుగుతామని, వ్యవస్థని విమర్శించే ముందు ఓటు హక్కు ద్వారా సరైన పరిపాలనను ఎంచుకోవాలన్నారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతమైన ఓటు ద్వారానే మన హక్కులను, మన బాధ్యతలను గుర్తుచేసే ప్రభుత్వం మన ముందు ఉంటుందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. "ఓటింగ్ కు మించింది ఏదీ లేదు" అనే నినాదంతో కేంద్ర ఎన్నికల సంఘం 2024 ఎన్నికలకు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఓటర్లగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. భీమవరం ఆర్డీవో కే శ్రీనివాసులు రాజు మాట్లాడుతూ ప్రస్తుతం మనం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడానికి ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ఈసీఐ జనవరి 25,1950లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2011 నుండి జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు హక్కును స్వతంత్రంగా వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా, ఓటు విశిష్టతను తెలుసుకొని వినియోగించుకోవాలన్నారు. భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, నిర్భయంగా ఓటు వేస్తామని జిల్లా కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అత్యధిక సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్ ఎస్.కోటేశ్వరరావు, డి.సత్యనారాయణ రాజు, జి.జేమ్స్, ఎ.సత్యనారాయణ, జి. సత్యనారాయణ రాజు మరియు శ్రీ విజ్ఞాన వేదిక స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి లకు పూలమాలవేసి శాలువా, మెమొంటోలతో జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఓటు హక్కు నమోదుకు ప్రోత్సహించిన బీవీ రాజ్ కళాశాల క్యాంపస్ అంబాసిడర్స్ మామిడి శెట్టి మహాలక్ష్మి, ఎం.శ్రీరాములు, ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ విద్యార్థులకు, ఇండస్ట్రీస్ ప్రతినిధి జీ శ్రీనివాస్ రెడ్డి, పాలకోడేరు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు, ట్రాన్స్ జెండర్ లకు, సెక్స్ వర్కర్స్ ను ప్రోత్సహించి ఓటు హక్కు నమోదు చేయించిన గుడ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి, ఓటు హక్కు పై విద్యాశాఖ ద్వారా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. సిగ్నేచర్ క్యాంపెన్ లో భాగంగా జిల్లా కలెక్టర్, తదితరులు బోర్డుపై సంతకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.ఆర్ కృష్ణం రాజు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ వై.దుర్గా కిషోర్, తహశీల్దారు వై.రవికుమార్, ఎలక్షన్స్ డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసి రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, డివైఇవో డి.శ్రీరామ్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగసాయి, విష్ణుకాలేజీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విష్ణుకాలేజీ, డియన్ఆర్ కాలేజీలతో పాటు పట్టణంలో పలు కళాశాలల, పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం





**దెందులూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని ప్రలోభాలకు లొంగకుండా వజ్రాయుధం లాంటి ఓటు హక్కు వినియోగించుకోవాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బిజెవైఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నమో నవ మత్దత సమ్మేళనం కార్యక్రమం తొలిసారి ఓటు వినియోగించుకునే ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించేందుకు, ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతిన బూనాలని యువ ఓటర్లకు మార్గనిర్దేశం చేశారు. భారతదేశ అభివృద్ధి యువత చేతిలోనే ఉందని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి పాటుపడే వాళ్ళకి తమ ఓటు వేసి మద్దతుగా నిలవాలని గారపాటి చౌదరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో అతి పెద్దదైన భారత ప్రజాస్వామ్య సౌధానికి ఓటు హక్కే ఆయువు పట్టు అని ఓటు వేయడం మన హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని ఆయన అన్నారు. ఓటు హక్కు ద్వారా తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే సదవకాశాన్ని ప్రతి యువ ఓటరు వినియోగించుకోవాలని రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు అన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ యువ ఓటర్లతో వర్చువల్ విధానం ద్వారా చేసిన ప్రసంగాన్ని ఎల్ఈడి స్క్రీన్ పై లైవ్ లో విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అదపాక నాగసురేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్, ఎన్ఎస్-ఎస్ అధికారి కుమార్, కాలేజీ డిన్ సుబ్రమణ్య శర్మ, ప్రసూన, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో సుధాసాగర్‌కి మోడరన్ ఫౌండేషన్ ప్రజాహిత అవార్డు ప్రధానం




**రామచంద్రపురం, జనవరి25 (శ్రీచక్ర) :**

ప్రభుత్వ,సామాజిక,రాజకీయ,క్రీడా,కళ, సేవా,విద్యారంగాలలో విశిష్ట సేవలు అందించే వారికి గత రెండున్నర దశాబ్దాలుగా మోడరన్ ఫౌండేషన్ వివిధ ప్రతిష్టాత్మక అవార్డులు ఇస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న సందర్భంగా ఆర్డీవోకి మోడరన్ ఫౌండేషన్ తరపున మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు ప్రజాహిత పురస్కారాన్ని గురువారం ఆర్డిఓ ఆఫీస్ లో జరిగిన ఓటర్ దినోత్సవ సభలో అందజేసారు. ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ ఆర్డివో గా విధులు స్వీకరించిన అనతి కాలంలోనే సుధాసాగర్ ప్రజా సమస్యలపై చురుగ్గా స్పందించి పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందారని, ప్రజాస్వామ్య దేశానికి పండుగైన ఓటర్ దినోత్సవం నాడు ఈ అవార్డు అందజేయడం సబబుగా భావించి ఆర్డిఓ కి సగౌరవంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వయోవృద్దులు,దివ్యాంగులు అయిన ఓటర్ల సౌకర్యార్థం తమ మోడరన్ ఫౌండేషన్ తరపున ఇరవై వీల్ చైర్స్ అందజేస్తామని సభికుల కరతళ ధ్వనుల మధ్య రావు ప్రకటించారు. అనంతరం ఆర్డీవో సుధాసాగర్ మాట్లాడుతూ మోడరన్ ఫౌండేషన్ ద్వారా రావు చేసున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం అని,ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల సౌకర్యార్థం జి.వి.రావు వీల్ చైర్స్ అందజేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోడరన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్,ఇంటర్మీడియట్ అకడమిక్ అడ్వైజర్ సి.హెచ్.శ్రీనివాస్, మోడరన్ స్టాఫ్ ఎన్.ఎస్.ప్రభాకర్, కె.కృష్ణవేణి,మోడరన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో ఘనంగా ఓటర్ల దినోత్సవం





- **ఓటర్లుతో ఆర్డీవో సుధాసాగర్ ప్రతిజ్ఞ**
- **మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ బారీర్యాలీ**

**రామచంద్రపురం, జనవరి 25 (శ్రీచక్ర) :**

జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం ఆర్డీవో సుదాసాగర్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రానున్న ఎన్నికల్లో ప్రతీఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో సుదాసాగర్ పేర్కొన్నారు. గురువారం రామచంద్రపురంలో జాతీయ ఓటర్లు దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం మండలం లో నెం.42 రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి సుధాసాగర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం, నందు పాల్గొన్న అందరిచే మానవహారంగా ఏర్పడి నిర్వహించి, ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల ఓటుకి సంబంధించిన స్లోగన్స్ తో మునిసిపల్ కార్యాలయము, నుంచి రెవిన్యూ డివిజనల్, కార్యాలయము వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయము నందు సమావేశం ఏర్పాటు చేసి, ఓటు హక్కుకి ఉన్న ప్రాధాన్యం, ఆవశ్యకత తెలియజేసి ప్రతీ ఎన్నికలలోను ప్రతీ ఒక్కరూ కూడా ఓటుని సద్వినియోగ పరుచుకోవాలని, ముఖ్యంగా యువత 18 సంవత్సరాలు పూర్తి అయిన వెంటనే ఓటు నమోదు చేయించుకోవాలని చూచించారు ప్రతీ ఒక్కరూ ఎన్నికలలో పాల్గొనాలని తెలియజేసి, ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్ లనుఈసందర్భంగా సన్మానించారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకుని మొదటి సారి వచ్చే ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోబోతున్న 18-19 వయస్సు కలిగిన వారిని అభినందించి, ఎన్నికలు, జాతీయ ఓటర్ల దినోత్సవానికి సంబంధించిన వక్తృత్వం, ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈసందర్భంగా బహుమతులు ప్రధానం చేసి, ఉత్తమ సేవలు అందించిన అధికారులకు సర్టిఫికెట్ లుతోపాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఓటరు నమోదు అధికార్లు, రామచంద్రపురం తహశీల్దార్, ఎం. వెంకటేశ్వర రావు, మునిసిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, జి. శ్రీనివాసు , తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, మునిసిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, మోడరన్ డిగ్రీ కాలేజి, కిట్స్ ఇంజనీరింగ్ కాలేజి, వి ఎస్ ఎం డిగ్రీ కాలేజి ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఇతర సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

email: sreechakratelugu@gmail.com
శ్రీచక్ర
రాజమండ్రి/నెల్లూరు

# ఫిబ్రవరి 16 నుండి 24 వరకు అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు

**దెందులూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా సంతాన లక్ష్మిగా పేరుపొందిన దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67 వార్షికోత్సవ మహోత్సవాలను ఫిబ్రవరి 16వ తేదీ నుండి 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గాలాయగూడెం ఉత్సవ కమిటీ నిర్ణయించిందని గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి మహోత్సవ కమిటీ తెలిపింది. అమ్మవారికి తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు అలంకరణలు చేసి ఉత్సవాలను ప్రారంభించడం జరుగుతుందని 16వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు కైకలూరు కి చెందిన నేషనల్ అవార్డు గ్రహీత గురువు కుమారి లక్ష్మీ జ్యోతి చే కూచిపూడి నృత్యం చేయడం జరుగుతుందని అనంతరం డాన్స్ బేబీ డాన్స్ మరియు మ్యూజికల్ నైట్ మరియు మిమిక్రీ షో నిర్వహించడం జరుగుతుందని, 17వ తారీకు న రాత్రి 9 గంటలకు వెన్నెల ఆర్కెస్ట్రా తో సిని మ్యూజికల్ నైట్ కార్యక్రమం ఉంటుందని 18వ తేదీన సత్య హరిచంద్ర వారణాసి కాటిసీను నాటక ప్రదర్శన, 19వ తేదీన ప్రముఖ గాయకురాలు మంగ్లీ టీం సన్నీ ఈవెంట్స్ కార్యక్రమం 20వ తేదీన శ్రీ రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన 21వ తేదీన రాత్రి 9 గంటలకు జబర్దస్త్ టీం ఆధ్వర్యంలో సుప్రీం ఆర్కెస్ట్రా కార్యక్రమం, 22వ తేదీన బాలనాగమ్మ మాయల పకీరు నాటకం, చింతామణి నాటకం 23వ తారీకు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ విజయవాడ తాడేపల్లిగూడెం వారిచే రాక్ స్టార్ ఈవెంట్ కార్యక్రమం. 24వ తేదీ 9 గంటలకు సత్య హరిచంద్ర నాటకం. మరియు 24 వ తారీకు శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి వేలాదిమంది భక్తులు సమక్షంలో అంగరంగ వైభవంగా శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని 25వ తేదీ వేలాదిమందికి భారీ అన్నదానం ఉదయం 11 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.




## చింతామనేని ఎమ్మెల్యేగా గెలిపిద్దాం అంటూ టిడిపి తీర్మానం



**దెందులూరు, జనవరి 25 (శ్రీచక్ర) :**

యువజన ఆంధ్ర ప్రదేశ్ ను అభివృద్ధి చేయాలన్న పోలవరం పూర్తి చేయాలన్న అమరావతి రాజధాని కొనసాగించాలన్న టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని దెందులూరు నియోజకవర్గంలో చింతామణి ప్రభాకర్ను భారీ మెజార్టీతో గెలిపించి నారా చంద్రబాబునాయుడు కి బహుమతిగా అందిద్దామని కొవ్వలి తెలుగుదేశం గ్రామ పార్టీ తీర్మానించింది. గురువారం కొవ్వలి గ్రామంలోని కొవ్వలి సహకార సంఘం బ్యాంకు మాజీ అధ్యక్షులు. కొవ్వలి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తా రాజ నివాస ఆవరణలో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గం లో చింతమనేని ప్రభాకర్ ను భారీ మెజారిటీతో గెలిపించుకుందమాని కొవ్వలి గ్రామ తెలుగుదేశం పార్టీ తీర్మానం చేసింది. కార్యక్రమంలో ఈ సమావేశం గుత్తా రాజా అధ్యక్షతన కొవ్వలి సాగునీటిదారుల సంఘం మాజీ అధ్యక్షులు వెలమాటి అశోక చక్రధర్ రావు (బుడ్డియ్య), సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు వడ్లపట్ల పండు, వెలమాటి అనిల్,మాజీ ఎంపీపీ పప్పల సుశీల,గారపాటి శ్రీను, టిడిపి తెలుగు యువత నేత కసుకుర్తి రామకృష్ణ, బలుసు శ్రీను, ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి పుట్టా రాజేష్, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గద్దే అమరేశ్వరరావు. ఎంపిటిసి అభ్యర్థి ఇనుముల హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ నేత మాగంటి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కార్యదర్శి బాలమురళీకృష్ణ, రజక సంఘం నేత టిడిపి సీనియర్ నాయకులు గోవాడ నాగరాజు మాజీ ఎంపిటిసి గౌరిపర్తి శ్రీనివాసరావు తదితర టిడిపి నేతలు పాల్గొన్నారు.

## వీరవాసరం మండలంలో ఘనంగా ఓటర్ల దినోత్సవం



**వీరవాసరం, జనవరి 25 (శ్రీచక్ర) :**

వీరవాసరం మండలంలో గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల వద్దసీనియర్ సిటిజెన్లుకు ఘన సన్మానం నిర్వహించారు. వడ్డీగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ సైదు శ్రీనివాసరావు,తోకలపూడిగ్రామంలో గ్రామ సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు,లు సీనియర్ సిటిజన్స్‌లకు ఘన సన్మానం నిర్వహించారు.

## గొల్లపాలెం హైస్కూల్ విద్యార్థిని అక్షయ ప్రియ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- అక్షయ ప్రియకు పలువురు ప్రముఖులు అభినందనలు

**కాజులూరు, జనవరి25(శ్రీచక్ర) :**



ఈనెల జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు సతీస్గడ్ రాష్టం కోర్బా లో 67 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యు 14 బేస్ బాల్ పోటీలకు కాజులూరు మండలం గొల్లపాలెం హై స్కూల్ నుందు 8 వ తరగతి చదువు తున్న విద్యార్థి ని పలివెల అక్షయ ప్రియ ఎంపిక అయిందని ఆపాఠశాల జి.హెచ్ ఎం ఎస్ ఎస్ బి సుశీలా మణి తెలిపారు.గురువారం ఈసందర్భంగా ఈవిషయాన్ని స్థానిక విలేకరులకు తెలిపారు. నవంబర్ 19 నుండి 21 వరకు నంద్యాల జిల్లా నందికొట్కూరు లో జరిగిన బేస్ బాల్ స్టేట్ మీట్ లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కెప్టెన్ గా, పిచ్చర్ గా జట్టు విజయం లో కీలక పాత్ర పోషించినందుకు ఆంధ్రప్రదేశ్ జట్టు లో స్థానం సాధించిందని , పాఠశాల పీడీ జి. సునీల్ కుమార్ ఈసందర్భంగా తెలిపారు.కాగా అక్షయ ప్రియ జాతీయ స్థాయిలో పోటికి ఎంపికైన సందర్భంగా కాజులూరు జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి వాసు రెడ్డి, ఎంపీటీసీ జొన్నకూటి సత్య పద్మజా వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాతా నాగరాజు, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు గుబ్బల ఏసురాజు,ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు ,సొసైటీ అధ్యక్షులు సత్తి శ్రీ రామా రెడ్డి,స్కూల్ స్టాఫ్, సెక్రటరీ పి.సత్యనారాయణ ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలియజేసారు.

## టీడీపీలోకి భారీగా చేరికలు

- పార్టీలోకి ఆహ్వానించిన టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్య ప్రభరాజా



**ప్రత్తిపాడు, జనవరి 25 (శ్రీచక్ర) :**

ప్రత్తిపాడు మండలం లంపక లోవ గ్రామం లో వైస్సార్సీపీ కి భారీ షాక్ తగిలింది.గ్రామ సర్పంచ్ పంది మణికుమారి, పంది దొరబాబు, చెక్కపల్లి బూరయ్య, చెక్కపల్లి సుబ్బారావు, చెక్కపల్లి మందేశ్వరారావు, శెట్టి సుబ్బారావు, సమ్మిటి అమ్మిరాజు మరో 300 మంది వైస్సార్సీపీ ని వీడి టీడీపీ లో చేరారు.నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వరుపుల సత్య ప్రభ రాజా సమక్షంలో వీరంతా టీడీపీ లో చేరారు...వీరికి సత్య ప్రభ రాజా టీడీపీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్బంగా సత్య ప్రభ రాజా మాట్లాడుతూ టీడీపీలో వీరందరికి ఘన స్వాగతం పలుకుతున్నాం అని అన్నారు..పార్టీ విజయం కోసం అందరూ కలిసి పని చేయాలి అని సత్య పిలుపునిచ్చారు.రాబోయే ఎన్నికలలో టీడీపీ,జనసేన లు కలిసి ప్రభుత్వం ను ఏర్పాటు చేయడం ఖాయం అన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికి తగిన గౌరవం,గుర్తింపు ఇస్తామని ఈ సందర్బంగా సత్య ప్రభ తెలిపారు..గ్రామ టీడీపీ నాయకులు జల్లిగంపల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమం లో టీడీపీ శ్రేణులు,జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

- జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు
- తాసిల్దార్ నాగరాజు వెల్లడి

**సంగం, జనవరి 25 (శ్రీచక్ర) :**



18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, అందరూ ఓటు ప్రాధాన్యత తెలుసుకుని బాధ్యతగా ఓటు హక్కును నియోగించుకోవాలని సంఘం మండలం తాసిల్దార్ నాగరాజు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం తాసిల్దార్ నాగరాజు మాట్లాడుతూ యువ ఓటర్లను రాజకీయ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా సంఘం తాసిల్దార్ కార్యాలయంలో వృద్ధులను ఘనంగా సన్మానించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ఓటు కన్నా ముఖ్యమైనది ఏదీ లేదు, నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను, ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించి జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చైతన్యపరచాలన్నారు. ఓటర్ల తుది జాబితా విడుదలైనప్పటికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు నూతన ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు తమ బీయల్ఓలను సంప్రదించి ఓటును నమోదు చేసే విధంగా చూడాలన్నారు.

## ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ






**ఆత్మకూరు నియోజకవర్గం. జనవరి 25 (శ్రీచక్ర) :**

రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలై నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొంది ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గురువారం పరామర్శించారు. నెల్లూరులోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ రోడ్డు ప్రమాదంలో వ్యక్తిగత కార్యదర్శి మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని, దేవుని దయ వల్ల ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ప్రాణపాయం నుంచి తప్పించుకున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే మేకపాటి వ్యక్తిగత కార్యదర్శి మృతికి తీవ్ర సంతాపం తెలియచేశారు. చంద్రశేఖర్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతుడై మళ్లీ అందరికి సేవలందించాలని దేవుడిని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి పేర్కొన్నారు.

## టీడీపీ కొత్త ఫేక్ ప్రచారం

**నెల్లూరు,జనవరి25(శ్రీచక్ర) :**

ఎల్లో మీడియా, టీడీపీల ప్రచారాలపై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. రాజకీయంగా తమను ఎదుర్కొనే దమ్ము లేక టీడీపీ అసత్య ప్రచారం చేస్తుందన్నారు. కృష్ణపట్నం పోర్టు టెర్మినల్‌పై ఎల్లో దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మంత్రి కాకాణి గురువారం మీడియాతో మాట్లాడుతూ..'టీడీపీ కొత్త ఫేక్ ప్రచారానికి తెరలేపింది. కేపీ పోర్ట్ తరలి పోతుందని ప్రచారం మొదలు పెట్టారు. మరోవైపు, కేపీ పోర్టు ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వానికి పోర్టుకు సంబంధించిన నివేదిక కూడా ఇచ్చింది. కొత్త వ్యాపారంతో ఏపీకి ఆదాయం వస్తోందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అయితే, అభివృద్ధిలో ఉన్న పోర్టును దెబ్బతీయాలని సోమిరెడ్డి ప్రచారం చేస్తున్నారు. పోర్టు వ్యాపారంలో హెచ్చుతగ్గులు ఉంటాయ. కానీ, పోర్టు పురోగతికి ఎలాంటి ఢోకా లేదు. కేపీ పోర్టులో ఎలాంటి సర్వీసులు రద్దు కాలేదు. ఎక్కడికి తరలిపోలేదు. పోర్టు ఎలాంటి సర్వీస్ కూడా తొలగించలేదు. గతంలో పవర్ పొల్యూషన్‌పై కమ్యూనిస్టులతో కలిసి ఆందోళన చేసిన సోమిరెడ్డి నాడు యాజమాన్యాలతో కుమ్మక్కయ్యారు' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

# ఆడుదాం ఆంధ్రలో అత్యంత ప్రతిభ కనబరిచిన మహిళా కోకో టీం

- నియోజకవర్గ స్థాయిలో రన్నర్ గా నిలిచిన వరికుంటపాడు మండల గణేశ్వర పురం మహిళ కోకో టీం
- మహిళా కోకో టీం ఆటగాళ్లను వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించి నియోజకవర్గం స్థాయికి తీసుకొని వెళ్ళిన నేత
- జిల్లా పశుగణాభివృద్ధి డైరెక్టర్, గణేశ్వర పురం సచివాలయ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాదం వెంకటనారాయణ రెడ్డి

**ఉదయగిరి/వరికుంటపాడు, జనవరి 25 (శ్రీచక్ర) :**



వరికుంటపాడు మండలంలోని గణేశ్వర పురం సచివాలయ మహిళా కోకో టీం గ్రామ స్థాయిలో నిలిచి అలాగే మండల స్థాయిలో గెలిచి గురువారం నాడు వింజమూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్ మైదానంలో జరిగిన నియోజకవర్గస్థాయి మహిళా కోకో పోటీల్లో 8 మండలాల నుంచి 8 టీంలు పాల్గొనగా వరికుంటపాడు మండలం గణేశ్వర పురం సచివాలయ మహిళా కోకో టీం నియోజకవర్గం స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో రన్నారుగా నిలిచింది. స్థానిక గ్రామ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు జిల్లా పశుగణాభివృద్ధి డైరెక్టర్ బాదం వెంకటనారాయణ రెడ్డి గ్రామంలోని యువ వనితలను వారికి ప్రతిభ ఉన్న ఆటలో వెన్నుద్దన్నుగా నిలిచి ప్రోత్సహించి గ్రామస్థాయిలోనూ విజేతగా నిలిచే విధంగా కృషిచేసి తిరిగి మండలంలోనూ ప్రథమ స్థానంలో నిలిపి గ్రామ కీర్తి ప్రతిష్టలు మండల స్థాయిలో నిలిపిన వీర వనితలు తిరిగి నియోజకవర్గ స్థాయిలోనూ గణేశ్వర పురం మహిళా కోకో టీం సభ్యులు 8 టీం లతో పోరాడి ద్వితీయ స్థానంలో (రన్నర్ గా) నిలిచారు. ఈ సందర్భంగా వరికుంటపాడు మండలం ఎంపీడీవో చేవూరి శ్రీదేవి మాట్లాడుతూ గణేష్వపురం సచివాలయ మహిళా కోకో టీం సభ్యులు అత్యంత ప్రతిభ కనుపరిచి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయిలో రన్నర్గా నిలిచి గ్రామ స్థాయి కీర్తి ప్రతిష్టలు అలాగే మండలం కీర్తి ప్రతిష్టలు నిలిపారని అందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అంతేకాకుండా స్థానిక వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాదం వెంకటనారాయణ రెడ్డి కోకో టీం సభ్యులకు అవసరమైనటువంటి భోజన సౌకర్యం రవాణా సౌకర్యం మరియు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి యువ కోకో టీం వనితలను ప్రోత్సహించి వెన్నుదన్నుగా నిలిచారు అందుకు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం టీం సభ్యులు మాట్లాడుతూ స్థానిక నేత బాదం వెంకటనారాయణ రెడ్డి అన్న నిత్యం గ్రామంలో ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్నా వారికి సహాయ సహకారాలు అందిస్తూ గ్రామ అభివృద్ధికి పాటుపడుతూ గ్రామంలోని యువతీ యువకులకు వారిలో ఉన్న ప్రతిభను వెలిగితీస్తూ ప్రోత్సహిస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అలాగే తమకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోకో టీం సభ్యులు పి టి మాస్టర్ తదితరులు ఉన్నారు.

## మీ హక్కును మీకందరించిన జగనన్నను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి
- అబద్దపు హామీలను ఇవ్వాల్సిన అవసరం లేదు జగనన్నకు లేదు.
- మెనిఫెస్టోకు నిజమైన అర్థం చెప్పిన జగనన్న
- సంక్షేమ పాలన కొనసాగించేందుకు మీరంతా తోడుగా నిలవాలి
- సంగంలో వైఎస్సార్ ఆసరా రూ.5.08 కోట్ల నమూనా చెక్కును అందచేసిన ఎమ్మెల్యే మేకపాటి





**సంగం, జనవరి 25 (శ్రీచక్ర) :**

గత ప్రభుత్వాలు ఇచ్చిన హామిలను తప్పి మహిళలను మోసం చేశారని, వారి హక్కులను సైతం కోల్పోయే విధంగా పాలన సాగించారని, అక్కచెల్లెమ్మలకు వారి హక్కులను వారి చేతుల్లో పెట్టి వారిని ఆర్థికంగా బలవంతులను చేసిన ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పాలన కొనసాగించుకుందామని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన సంగంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగంకు వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం సంక్షేమప్రధాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పొదుపు మహిళలతో కలసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో జరిగిన మార్పులను అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం మహిళలను ఆదుకుంటామని చెప్పి ఎన్నో హామిలు ఇచ్చారని, మహిళలు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిన విషయం అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. 2019లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామిని ముఖ్యమంత్రి అయిన తరువాత నూటికి నూరు శాతం అమలు చేశారన్నారు. 2019 వరకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మలకు అందచేస్తానని ఎంత భారమైనా వారికి అందచేస్తానని చెప్పి రూ.25వేల కోట్లు అందచేయడం జరిగిందని వివరించారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి ఇప్పటి వరకు చేయని విధంగా మెనిఫెస్టోకు నిజమైన అర్థం చెప్పారని అన్నారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాల పాటు రాష్ట్రానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా జగనన్న ఇచ్చిన మాట మేరకు ఏ సంక్షేమ పథకాన్ని నిలుపుదల చేయకుండా అమలు చేశారని వివరించారు. ఇలాంటి సంక్షేమాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు తన కుమారుడు లోకేష్ ను పాదయాత్రకు పంపించారన్నారు. రాష్ట్రంలో లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ వివరించారని, దీంతో నాలుగేళ్ల పాటు హామిలను తీవ్రంగా విమర్శించిన చంద్రబాబునాయుడే ఆ పథకాలను తాను అమలు చేస్తానంటూ మెనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకొచ్చారని, 2014లో ఇచ్చిన హామిల అమలు ఎలా జరిగిందో అక్కచెల్లెమ్మలందరికి తెలుసునన్నారు. గతంలో ఆయన ఇచ్చిన హామిలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన ఆయన మళ్లీ ఇప్పుడు జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలను కాపీ కొడుతూ ప్రజల ముందుకు వస్తున్నారని, ఇలాంటి వారిని ప్రజలు విశ్వసించే పరిస్థితుల్లో లేరన్నారు. సంక్షేమాభివృద్ధికి నిజమైన అర్థం చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటే ప్రతి ఒక్కరి కుటుంబం మళ్లీ వృద్ధిలోకి వస్తుందని పేర్కొన్నారు. సంక్షేమ ప్రభుత్వం చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ప్రతి ఒక్క చెల్లెమ్మ తీసుకోవాలని అన్నారు. అనంతరం సంగం మండలంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కింద మంజూరు అయిన రూ.5.08 కోట్ల నమూనా చెక్కును మహిళలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి కానుక అందజేసిన కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్



**ఉదయగిరి/జలదంకి, జనవరి 25 (శ్రీచక్ర) :**

జలదంకి మండలము లోని జమ్మలపాలెం గ్రామంలో శ్రీ షేక్ మస్తాన్ వలి - శ్రీమతి మస్తానమ్మ కుమార్తె వివాహ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు ఆహ్వానం మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్ల సురేష్ విచ్చేసి నూతన వధూవరులైన చి౹౹ షేక్ హజరత్ బాబు - చి౹౹ల౹౹సౌ౹౹ నూర్-ఇ-చష్మి లను ఆశీర్వదించి వారికి పెళ్లి కానుక ను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జయహెూ బిసి కార్యక్రమంను విజయవంతం చేయండి

- పిలుపునిచ్చిన మండల కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకార్

**ఉదయగిరి/కొండాపురం, జనవరి 25 (శ్రీచక్ర) :**



కొండాపురం మండల కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకార్ మాట్లాడుతూ 26వ తేదీ అనగా శుక్రవారం సాయంత్రం 3:00 గంటలకు మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో జయహెూ బిసి సభ ను విజయవంతం చేయాలని నాయకులు కార్యకర్తలు ప్రజలను కోరారు. అనంతరం అదే గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా ప్రజా దీవెన యాత్ర ఇంటింటికి కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు, ఎమ్మెల్యే మేకపాటి చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్ మరియు నియోజకవర్గ పరిశీలకులు వికాస్ హరికృష్ణ హాజరవుతారు అని అన్నారు. కావున మండలంలోని ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్యంగా కొండాపురం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలలో బిసి నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## గొట్టిపాటి కొండప నాయుడు ప్రజల మనిషి

- ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో గొట్టిపాటిని చూసి నేర్చుకోవాలి
- ఉదయగిరి నియోజకవర్గంలో గొట్టిపాటి కొండపనాయుడు విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం
- మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు



**కావలి, జనవరి 25 (శ్రీచక్ర) :**

గొట్టిపాటి కొండప నాయుడు ప్రజల హృదయాలను గెలిచిన మనిషి అని ఆయన పట్ల కావలి, ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఎంతో ప్రేమ అప్యాయతలు చూపేవారని ఆయన కూడా ప్రజల పట్ల అలాగే ఉండేవారని మాజీ శాసనసభ్యులు ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. గురువారం నాడు కావలి పట్టణంలోని ట్రంక్ రోడ్ లో స్వర్గీయ గొట్టిపాటి కొండప నాయుడు వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి మరియు ఉదయగిరి నియోజకవర్గాల లోని రైతులకు సాగునీరు అందించేందుకు పోరాటం చేసిన యోధుడు అన్నారు. ఆయన కృషి ఫలితమే జీకేఎన్ ఉత్తర కాలువ మరియు కావలి కెనాల్ ఏర్పడ్డాయని తెలిపారు. నేను శాసనసభ్యునిగా 2014 నుంచి 2019 టిడిపి హయాంలో 105 కిలోమీటర్లు సోమశిల ఉత్తర కాలవ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు గ్రామం అయిన కొమ్మి పంచాయితీ వరకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. వింజమూరు సమితి ప్రెసిడెంట్ గా మూడు పర్యాయములు వారు పని చేయటం జరిగింది వారి సేవలకి గుర్తుగా త్వరలో ఆయన విగ్రహాన్ని ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు పట్టణమునందు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇవ్వడం జరిగినది. అనంతరం వర్ధంతి వేడుకలు సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, బిజెపి సీనియర్ నాయకులు కందుకూరు వెంకట సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు కాకి ప్రసాద్, గ్లోబల్ హాస్పిటల్ వైస్ చైర్మన్ రమాధర్ నాయుడు, కావలి, ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఓటర్లపై ఒత్తిడి తెచ్చే వారిపై కఠిన చర్యలు

**హైదరాబాద్,జనవరి25(శ్రీచక్ర) :**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి తీరుపై రాష్ట్ర గవర్నర్ తమిళి సై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ఉద్దేశించి పాడికౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఓటర్స్ డే సందర్భంగా గవర్నర్ ప్రస్తావించారు. ఓటు వెయ్యకపోతే కుటుంబంతో ఆత్మహత్య చేసుకుంటానన్న పాడి కౌశిక్ వ్యాఖ్యలపై మండిపడ్డ గవర్నర్.. అలాంటి వాళ్లపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా జేఎన్టీయూలో నిర్వహించిన సభలో గవర్నర్ మాట్లాడుతూ... ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా అని ఓ అభ్యర్థి అన్నారని.. ఎలక్షన్ కమిషన్ అలాంటి వాళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

# మరో తెలంగాణ నేపథ్య సినిమా కథ






### ● నానితో బలగం వేణు సినిమా

బలగం సినిమాతో అనూహ్య విజయాన్ని అందుకున్న జబర్దస్త్ వేణు ఇండస్ట్రీ మొత్తాన్ని ఒక్కసారిగా తనవైపుకు తిప్పుకున్నాడు. దాంతో జబర్దస్త్ వేణు కాస్త బలగం వేణుగా మారిపోయాడు. వేణు తన తరువాతి సినిమా కోసం నేచురల్ స్టార్ నానిని సెలెక్ట్ చేసుకున్నాడని టాక్. ఈ కాంబోని టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు సెట్ చేశారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కు సంబందించిన కథ చర్చలు పూర్తవగా.. నేరేషన్ కూడా కంప్లీట్ అయినట్లు సమాచారం. వేణు తన కెరీర్ ఫస్ట్ ఫిల్మ్ తోనే సినీ ఇండస్ట్రీని తనవైపు తిప్పుకున్నాడు. ప్రేక్షకులకు తన సహజ నటనతో దగ్గరైన నానితో..ఎలాంటి కథతో వస్తున్నాడనే ఉత్కంఠ కలుగుతోంది. ఇప్పుడు ఈ న్యాచురల్ కాంబో నుంచి ఆసక్తికర లీక్ బయటికి వచ్చింది. అదేంటంటే, ఈ సినిమా తెలంగాణ పల్లెటూరిలో జరిగే ఓ పీరియాడికల్ లవ్ స్టోరీ అని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. నాని కెరీర్‌లో ఇదివరకే శ్యామ్ సింగరాయ్‌తో పీరియాడిక్ కాన్సెప్ట్ టచ్ చేశాడు. ఇప్పుడు మళ్లీ నానితో కొత్తగా తెలంగాణ లవ్ స్టోరీతో..బలగం వేణు తనదైన పాత కాలానికి..ప్రేమలు హత్తుకునే సామ్రాజ్యానికి తీసుకెళ్తున్నాడు. త్వరలో ఈ సినిమా నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవలే నాని హాయ్ నాన్న సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఫాదర్ అండ్ డాటర్ ఎమోషనల్ కాన్సెప్ట్ తో వచ్చిన ఈ సినిమా డీసెంట్ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం వివేక్ ఆత్రేయ డైరెక్షన్ లో సరిపోదా శనివారం మూవీలో నటిస్తున్నాడు.



# శేఖర్ కమ్ముల సినిమాలో నాగార్జున

### చంచల్‌గూడలో షూటింగ్ ప్రారంభం

అక్కినేని నాగార్జున నటించిన 'నా సామి రంగ' సినిమా సంక్రాంతికి విడుదలైంది. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని ఈ సినిమాకి దర్శకుడు, ఇది అతనికి మొదటి సినిమా. ఇందులో అల్లరి నరేష్, రాజ్ తరుణ్ లు కూడా ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఘన విజయం సాధించటంతో, ఈ చిత్ర దర్శకుడి విజయ్ బిన్నిని కొరియోగ్రాఫర్స్, డాన్సర్స్ సంఘం సన్మానం చేసింది. నాగార్జున ఈ సినిమా విజయం పట్ల చాలా సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తన తదుపరి సినిమా షూటింగ్ కూడా మొదలెట్టేసానని చెపుతున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో ఒక సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అప్పుడే మొదలైంది, నాగార్జున మీద కొన్ని ప్రధాన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా కోసమని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను హైదరాబాదు చంచల్ గూడా జైలులో చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. ఈ సినిమా షూటింగ్ రెండు రోజుల నుండి చంచల్ గూడా జైలులో అవుతోందని, ఇంకా ఒకటి రెండు రోజులు అక్కడే జరుగుతుందని కూడా తెలుస్తోంది. ఈ సినిమాలో నాగార్జున ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు, అది సినిమాలో చాలా హైలైట్ గా ఉంటుందని కూడా చెపుతున్నారు. నాగార్జున, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటించడం ఇదే మొదటిసారి. శేఖర్ కమ్ముల ఇంతకు ముందు తీసిన 'లైఫ్ ఐస్ బ్యూటిఫుల్' అనే సినిమాలో నాగార్జున భార్య, అమల అక్కినేని నటించారు. అప్పుడే నాగార్జున తనతో ఎప్పుడు సినిమా చేస్తున్నావు అని శేఖర్ కమ్ముల ని సరదాగా అడిగారు. అది ఇప్పుడు ఇలా కార్యరూపం దాల్చింది. శేఖర్ కమ్ముల, ధనుష్, నాగార్జున కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాకి ఏషియన్ సునీల్, పుష్కర్ రామ్ మోహన్ రావు నిర్మాతలు.

# శరవేగంగా బాలయ్య సినిమా చిత్రీకరణ






నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న బాలయ్య..తన తరువాత సినిమా పవర్ ఫుల్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ ఎన్‌బికె 109 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్నారు. వాల్తేరు వీరయ్యతో బిగ్గెస్ట్ హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. మొదటిసారి బాబీ బాలయ్య ఊరమాస్ కాంబోలో సినిమా రాబోతుండడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీలో 'యానిమల్'తో మెప్పించిన బాబీడియోల్ ఇందులో విలన్‌గా నటిస్తున్నాడు. ఇటీవలే తను ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. బాలకృష్ణ, బాబీడియోల్ మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ పోటాపోటీగా ఉండబోతున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఎలాంటి ప్రచారం లేకుండా సైలెంట్‌గా షూటింగ్ కానిచ్చేస్తున్న మేకర్స్..రిలీజ్ డేట్ విషయంలోనూ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారట. ఈ సినిమా మొదలు పె÷-టటె ముందు దసరాకి రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. కానీ ఈ సినిమా మే లేదా జూన్ నెలలో రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ సినిమా షూటింగ్ వీలైనంత త్వరగా పూర్తిచేసి జూన్ లో రిలీజ్ చేసేందుకు షూటింగ్ శరవేగంగా జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం రిలీజ్ విషయంపై..త్వరలో మేకర్స్ అధికారికంగా ప్రకటించే అవకాశం కనిపిస్తుంది.

# విశాల్ రత్నం మూవీ విడుదలకు సిద్ధం




తమిళ హీరో విశాల్‌కు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంది. ఆయన సినిమాలను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడతారు. కారణం ఆయన తెలుగు నటుడే కావడం. కాకపోతే.. తమిళ ఇండస్ట్రీలో సెటిల్ అయ్యారు. అందుకే విశాల్ సినిమా కోసం తెలుగు ఆడియన్స్ కూడా ఎదురుచూస్తూ ఉంటారు. ఆయన హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ రత్నం. మాస్ అండ్ యాక్షన్ చిత్రాల దర్శకుడు హరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ మాస్ కంటెంట్ వస్తున్న ఈ మూవీ నుండి ఇప్పటికే విడుదలైన టీజర్ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో ఈ సినిమా రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమా రిలీజ్ పై క్లారిటీ ఇచ్చారు మేకర్స్. రత్నం సినిమా ఏప్రిల్ 26న థియేటర్స్ లోకి రానున్నట్లు అధికారిక ప్రకటన చేశారు. దీంతో విశాల్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. సమ్మర్ లో విశాల్ మాస్ సంభవం చూడబోతున్నారు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమాకు సంబందించిన ప్రమోషన్ పనులు కూడా త్వరలోనే మొదలుకానున్నాయి. వాటిలో భాగంగా.. ముందుగా రత్నం టీజర్ రిలీజ్ చేసి, ఆతరువాత వరుసగా సాంగ్స్ రిలీజ్ చేసి సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇక విశాల్ నుండి వచ్చిన గత చిత్ర మార్క్ ఆంటోనీ బాక్సాఫీస్ దగ్గర మంచి విజయం సాధించింది. దీంతో రత్నం సినిమాపై అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. అలాగే సినిమా కూడా ఉంటుందని, ఖచ్చితంగా విశాల్ కెరీర్ లో మరో బ్లాక్ బస్టర్ కన్ఫర్మ్ అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్. మరి నిజంగా ఈ సినిమా విశాల్ కు మరో హిట్టు అందిస్తుందా అనేది తెలియాలంటే మరో రెండు నెలల ఆగాల్సిందే.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**